

ప్యాసింజర్ రైలు వచ్చేనా..?



కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి.. సొరంగ మార్గాలతో ఎన్నో వ్యయప్రయాసలతో నిర్మించిన కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వేలైనులో ఇప్పటివరకు ఒక ప్యాసింజర్ రైలు కూడా నడవలేదు. వెలిగొండ అడవుల్లో ప్రకృతి అందాల నడుమ సాగే ఈ రైలు మార్గం ప్రయాణికులకు ఎంతో అనుభూతిని ఇస్తుంది. కృష్ణపట్నం పోర్టు నుంచి ఇతర రాష్ట్రాలకు బొగ్గు, ఇనుము తదితర అన్ని ఖనిజాలను దిగుమతులు, ఎగుమతులు చేసుకోవడానికి ఈ మార్గాన్ని నిర్మించినా ప్యాసింజర్ రైళ్లు కూడా నడుపుతామని చెప్పిన అప్పటి కేంద్ర ప్రభుత్వం అనంతరం దాని గురించి పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.




మంగంపేట వద్ద నిర్మించిన రైల్వేస్టేషన్

- ప్రకృతి అందాల నడుమ సాగే ప్రయాణం
- కృష్ణపట్నం-ఓబులవారిపల్లె మార్గంలో నడవని ప్యాసింజర్ రైళ్లు
- అన్నమయ్య, కడప జిల్లాల ప్రజలకు ఎంతో అనుకూలం
- గూడ్స్ రైళ్లకే పరిమితం
- రైళ్లు నడుపుతామని చెప్పినా.. పట్టించుకోలేదు..

రాజంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం-ఓబులవారిపల్లె మార్గానికి 2006లో రూపకల్పన చేయగా 13 ఏళ్ల తర్వాత 2019లో పూర్తయి ప్రారంభానికి నోచుకుంది. తొలుత ఖనిజాన్ని సరఫరా చేసే గూడ్సు రైళ్లను ప్రారంభించినా త్వరలో ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లను కూడా నడుపుతామని అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ఆరేళ్లయినా దాని ఊసే లేకుండాపోయింది. ప్రారంభం రోజున మాత్రం అధికారులు అటు ఇటు తిరగడానికి, అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ రైలుమార్గాన్ని చూడడానికి ఓ ప్రత్యేక రైలును ఏర్పాటు చేసి అందరికీ చూపించారు. అనంతరం ఏ ఒక్క ప్యాసింజర్ రైలు కూడా ఈ మార్గంలో తిరగలేదు. సుమారు 136 కిలోమీటర్ల నిడివి గల ఈ రైల్వేలైను మార్గం నెల్లూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ఓబులవారిపల్లె, వెంకటరాజుపల్లె, చిట్వేలి, రాపూరు, నెల్లూరు మీదుగా కృష్ణపట్నం చేరుతుంది. ప్రధానంగా ఆసియా ఖండంలోనే ఈ రైలు మార్గానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆసియా ఖండంలోనే అతి పొడవైన సొరంగ మార్గాలు ఇక్కడే ఉన్నాయి. నెల్లూరు-అన్నమయ్య జిల్లాలో ఉన్న వెలిగొండ అడవిలో 7.5 కిలోమీటర్ల భారీ సొరంగ మార్గాన్ని ఎంతో ఆధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేశారు. మరో చోట కూడా 0.860 పొడవుతో మరో సొరంగ మార్గాన్ని కూడా నిర్మించారు. ఓబులవారిపల్లె నుంచి వెంకటాచలం వరకు అన్నమయ్య జిల్లాలోని మంగంపేట, చెర్లోపల్లె, నెల్లూరు జిల్లాలోని నవాబుపేట, సుంకురాత్రిపల్లె, కుసుమానుపల్లె, కసమూరులలో ఆధునిక టెక్నాలజీతో రైల్వేస్టేషన్లు నిర్మించారు.

నెల్లూరు జిల్లా కండలేరు వద్ద పెద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఈ రైల్వేలైను మార్గానికి విద్యుత్ లైను ఏర్పాటు చేశారు. భారత రైల్వే వ్యవస్థలోనే ఒక్క గేటు కూడా లేని అధునాతన రైల్వేమార్గంగా కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వేమార్గం పేరు గడించింది. సుమారు 16 మీటర్ల ఎత్తులో రైల్వేట్రాక్‌ను ఏర్పాటు చేశారు. వాహనాలు, బస్సులు తిరిగేందుకు వీలుగా కాలువలు, నదులు, రోడ్ల వద్ద భారీ వంతెనలు నిర్మించారు. ఈ రైల్వేమార్గంలో ప్యాసింజర్ రైళ్లను కూడా నడిపితే అటు నెల్లూరు ఇటు అన్నమయ్య జిల్లాల మధ్య రాకపోకలు సులభతరమవుతాయి. ఈ రెండు జిల్లాల నడుమ రాజంపేట, రాపూరు, గూడూరు, నెల్లూరు డిపోల నుంచి బస్సులు నడుస్తుంటాయి. ఈ అటవీ మార్గంలో ఎన్నో మలుపులు, లోయలు ప్రయాణానికి అనువుగా లేవు. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఈ ప్రాంతంలో ప్యాసింజర్ రైళ్లను ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అటవీ అందాలను తిలకిస్తూ ఆసియాలోనే అతి పెద్దదైన సొరంగం మార్గం గుండా ప్రయాణం ప్రయాణికులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని గమనించి రైల్వే మంత్రితో చర్చించి కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వేమార్గంలో ప్యాసింజర్ రైళ్లను నడపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వే మార్గంలో అతిపెద్ద సొరంగమార్గం



వెలిగొండ అడవిలో సొరంగమార్గం

ప్యాసింజర్ రైళ్లు నడిపితేనే ఉపయోగకరం..



కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైలుమార్గంలో ప్యాసింజర్ రైళ్లు నడిపితేనే ప్రయోజనకరం. ఆరేళ్లుగా ఈ మార్గంలో కేవలం సరుకులు తీసుకెళ్లే గూడ్సు రైళ్లే వెళుతున్నాయి. ప్రయాణికులు వెళ్లడానికి ప్యాసింజర్ రైళ్లను ఏర్పాటు చేస్తే ఈ రైలు మార్గానికి సార్థకత లభిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆరు రైల్వేస్టేషన్లను ఏర్పాటు చేసి స్టేషన్ల వద్ద మూడు ట్రాక్‌లను ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లను నడపాలి.

- కిశోర్‌కుమార్, మండల మాజీ ఉపాధ్యక్షుడు, చెర్లోపల్లె, చిట్వేలి మండలం

ఆరేళ్లయినా అతీగతి లేదు..



కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వేమార్గాన్ని ప్రారంభించి ఆరేళ్లు పూర్తయినా అతీగతి లేదు. ప్యాసింజర్ రైలు నడవడానికి అన్ని సౌకర్యాలు ఉన్నా ఎందుకు నడపడం లేదో అర్థం కావడం లేదు. రెండు జిల్లాల ప్రజలకు ఉపయోగపడే ఈ రైలుమార్గంలో వెంటనే ప్యాసింజర్ రైళ్లను నడపాలి. దీనివల్ల రెండు జిల్లాల్లో ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ప్యాసింజర్ రైలును నడపాలి.

- పన్నీరు రాజశేఖర్, ముక్కావారిపల్లె, ఓబులవారిపల్లె మండలం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన-పీ4 సర్వే పకడ్బందీగా చేయాలని, వాట్సాప్ పరిపాలన ద్వారా సేవలు ప్రజలకు అత్యంత చేరువలో సేవలు ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం వెలగపూడి సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వివిధ అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ద్వారా ఉమ్మడి 13 జిల్లాల కేంద్రాల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షను ఏపీపీఎస్సీతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అన్నక్యాంటీన్లు, ఏపీఎస్‌ఆర్టీసీ బస్‌స్టేషన్ల నిర్వహణ, ముఖ్యమైన దేవాలయాల నిర్వహణ, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై లబ్ధిదారుల నుంచి ఐవీఆర్‌ఎస్ ద్వారా తీసుకున్న అభిప్రాయాలపై సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని రకాలుగా సన్నద్ధమవ్వాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డీఆర్‌వో మధుసూదన్‌రావు, సీపీవో వెంకట్, డీఈవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ వాసు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆధార్ తరహాలో రైతు సేవా కేంద్రాల ద్వారా 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రతి రైతు పొందాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం ఆయన రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరంలో గల రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరించేందుకు రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను (యూనిక్ ఐడీ) ఆధార్‌కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, రాయితీలు ఇతర వ్యవసాయ సేవలు పొందాలంటే ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని, పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, వ్యవసాయ పరికరాల రాయితీలు, పంట నష్టపరిహారం, పెట్టుబడి, ఎరువుల రాయితీలు ఇలాంటి వాటిని ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య మరింత సులభతరం చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఫార్మర్ రిజిస్ట్రీ రైతు సేవా కేంద్రాల్లో జరుగుతోందని, రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింకు అయిన ఫోన్ నెంబరు ఉన్న ఫోను తీసుకొని రైతు సేవా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దివాకర్‌బాబు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దిగువఅబ్బవరం రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


రూ.290 కోట్లతో శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు

- వెలిగల్లు నుంచి ఆరు మండలాలకు తాగునీరు అందిస్తాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులను రూ.290 కోట్లతో పూర్తి చేసి కరువు రైతులకు సాగునీరు అందిస్తామని, రాయచోటి నియోజకవర్గంలో గల 6 మండలాల్లోని 780 పల్లెలకు వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గుంతలమయమైన రోడ్ల మరమ్మతులకు రూ.6 కోట్లు ఖర్చు చేసి గుంతలు పూడ్చామని తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో సిమెంటు రోడ్లకు రూ.40 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న శ్రీనివాపురం రిజర్వాయర్ పనులను రూ.290 కోట్లతో పూర్తి చేసి కరువు రైతులకు సాగునీరు అందిస్తామని, అలాగే రూ.300 కోట్లతో వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా రాయచోటి నియోజకవర్గంలోని 6 మండలాల్లోని 780 పల్లెలకు తాగునీరు అందిస్తామని తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో లక్షల కోట్ల అప్పు చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడి దౌర్జన్యాలకు పాల్పడిన వారిని కటకటాల పాలు చేస్తుంటే జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని చెప్పారు. గత ఎన్నికల్లో 39 శాతం వైసీపీకి ఓట్లు వచ్చాయని, రాబోయే రోజుల్లో 30 శాతానికి పడిపోయి ఒక సీటు వస్తుందేమో అని జగన్‌కు మతిభ్రమించినట్లు ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, స్థానిక నాయకులు మదిరెడ్డి రమేశ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, హరినాథరెడ్డి, సాధు జయచంద్రారెడ్డి, సహదేవ, శివప్రసాద్, ఎద్దుల చిన్నప్ప, ఆంజనేయులు, రమణయ్య, ప్రసాద్, చిన్నరమణయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ వీరేంద్ర, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



6

గురువారం ఉదయం కలికిరి పరిసరాల్లో కురుస్తున్న దట్టమైన పొగ మంచు



పగమంచు!

- రోజు మార్చి రోజు దట్టంగా...
- మామిడి పూతపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఆందోళన

కలికిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాలంగాని కాలంలో దట్టమైన పొగమంచు రైతులపై పగబట్టినట్లు కురుస్తోంది. పగలంతా ఎండ ఉన్నా రాత్రుళ్లు మంచు కురుస్తోంది. ఈ మంచు బంకలాగా సాగుతోందని, దీంతో ఇప్పుడిప్పుడే మామిడిలో పూత వస్తున్న దశలో ఈ మంచు తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగానైనా మామిడిలో వస్తున్న పూత ఆశాజనకంగా ఉన్నా ప్రస్తుతం కురుస్తున్న మంచు చివరికి ముంచేస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగ మంచు నుంచి మామిడిపూతను కాపాడుకోవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విరగబూసిన మామిడి పూత

ప్రతిభకు పట్టాభిషేకం

- బీసీ గురుకుల విద్యార్థినులకు జాతీయ పురస్కారం
- దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎన్నికైన కలికిరి విద్యార్థినులు
- నేడు బెంగళూరులో అవార్డుల ప్రదానం

కలికిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కలికిరిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. విప్రో ఫౌండేషన్ 'విప్రో ఎర్తియన్-24' పేరుతో ప్రాజెక్టుల రూపకల్పన కోసం దేశ వ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల నడుమ నిర్వహించిన పోటీల్లో కలికిరి గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు విజయబావుటా ఎగురేశారు. 'పాఠశాలల్లో సుస్థిర విద్య సాధన దిశగా నీరు, జీవవైవిధ్యం, వ్యర్థ పదార్థాలు' అనే అంశంపై ప్రాజెక్టులు రూపొందించాలని కోరింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన మొత్తం 1550 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించి పోటీలకు పంపించారు. ఆ తరువాత వివిధ స్థాయిల్లో జరిగిన వడపోతల అనంతరం అద్భుతమైన ప్రాజెక్టులను రూపొందించిన 15 రాష్ట్రాలకు చెందిన 23 పాఠశాలలను నిపుణుల కమిటీ విజేతలుగా ఎంపిక చేసింది. ఇందులో ఏపీ నుంచి రెండు పాఠశాలలు పంపిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. అందులో ఒకటి కలికిరి బీసీ గురుకుల బాలికల పాఠశాల కాగా నంద్యాల జిల్లా మహానంది మోడల్ స్కూల్ రెండవది.



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు



ప్రిన్సిపాల్ సోమశేఖర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ అఫ్సానాతో విజేతలైన విద్యార్థినులు

విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టే ప్రాజెక్టు

కలికిరి బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఒక బృందంగా ఏర్పడి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వీరికి పాఠశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, గతంలో ఇదే పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయురాలిగా పనిచేసి ప్రస్తుతం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ అఫ్సానా చేయూతనిచ్చారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులు స్వర్ణకుమారి (బయాలజీ), దిల్షాద్ (ఫిజిక్సు) వీరికి అండదండలు అందించారు. ఈ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థినులు కె.ఖ్యాతి (ఏర్పేడు), జె.శ్రీరూపిక (తాడిమర్రి), టి.భవ్యశ్రీ (ఐరాల), 8వ తరగతికి చెందిన ఎం.చందన అగర్వాల్ (కెవీ పల్లె మండలం మారెళ్ల), పి.సుప్రియ (కలకడ మండలం మంగలపల్లె) వ్యవసాయ పొలాల్లో నిండిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పౌల్ట్రీ ఫారాలలో పేరుకుపోతున్న వ్యర్థాల గురించి సమగ్ర ప్రాజెక్టు రూపొందించి ప్రదర్శించి జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారు.

నేడు అవార్డుల ప్రదానం

విజేతలకు శుక్ర, శనివారాల్లో అవార్డులు ప్రదానం చేసేందుకు విప్రో సంస్థ ఆధ్వర్యంలో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో రెండు రోజుల కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషిద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈవో అనురాగ్ బెహర్ విజేతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఒక్కో పాఠశాలకు రూ.50 వేల వంతున నగదుతో పాటు ప్రశంసాపత్రాలు, ఇతర బహుమతులు అందజేయనున్నారు.

అందాల అడవిలో మూడు కొండల మల్లన్న



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్



శివలింగం

తంబళ్లపల్లె, ఆంధ్రజ్యోతి


తంబళ్లపల్లెకు సమీపంలో సముద్ర మట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో మల్లయ్యకొండపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని విజయనగరరాజు వీరదేవరాయ-1 ధన సహాయంతో ఏకిల దొరలు నిర్మించినట్లు చెబుతోంది. శిథిలస్థితికి చేరుకున్న మల్లయ్యకొండ ఆలయాన్ని మూడేళ్ల కిందట పునరుద్ధరించారు. ఆలయ మండపంలో కుడి వైపున వీరభద్ర స్వామి, ఎడమ వైపున పార్వతీదేవి ఉన్నారు.

గౌరమ్మ గుడి



మల్లయ్యకొండ ఆలయం నుంచి ఉత్తరం దిక్కులో అర కిలోమీటరు ఎగువన గౌరమ్మ ఆలయం ఉంది. సంతానం లేని మహిళలు, వివాహం కాని స్త్రీలు కోనేటిలో స్నానమాచరించి తడి బట్టలతో అమ్మవారికి వరపడతారు. గుడి దగ్గర ఉన్న చెట్లకు ముడుపులు(ఊయలలు) కట్టి, చిన్న రాళ్లను ఒకదానిపై ఒకటి పేర్చి కోర్కెలు తీరాలని మొక్కుకుంటారు. ఆలయంకు ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడి నుంచి చూస్తే సుమారు 150 కిలోమీటర్లు దూరంలో ఉన్న తిరుమల కొండలు కనపడుతాయి.

మూడు కొండల మల్లన్న మీద అన్నమయ్య జిల్లావాసులకు అనంతమైన గురి. ఏ కష్టం వచ్చినా మల్లన్నకు మొక్కుకుంటే చాలు అనే నమ్మకం. తంబళ్లపల్లె సమీపంలోని సాధు, ఇనుము, మల్లయ్యకొండలపై వెలసిన ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తుంటారు. ఈ శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధమవుతున్నాయి.



మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయం

గౌరీ నోము

కార్తీకమాసంలో భక్తులు ఆలయంలో ఒక రోజు రాత్రి నిద్ర చేసి, వేకువనే కోనేరులో స్నానమాచరించి సూర్యోదయాన స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కార్తీక సోమవారాల్లో వేల మంది ఉపవాసంతో కొండకు వెళ్లి కేదారేశ్వర గౌరీ నోములు నోచుకుంటారు. మహిళలు ఆలయ ధ్వజ స్తంభం వద్ద నేతి దీపాలు వెలిగించి కోర్కెలు నెరవేరాలని వేడుకుంటారు.

ఏనుగు మల్లమ్మకు తొలి పూజ



మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఒక కిలో మీటరు దిగువన మల్లికార్జున స్వామి సోదరిగా భావించే ఏనుగుమల్లమ్మ ఆలయం ఉంది. అందంగా లేదని చెల్లెలు ఏనుగు మల్లమ్మను శివయ్య పెళ్లిచూపులకు తన వెంట రావద్దని చెప్పాడంతో ఆమె అలిగి ఇక్కడ శిలగా మారిందని ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. చెల్లెలిని శాంతపరచడానికి తొలి పూజ నీకే దక్కుతుందని శివుడు ఆదేశించాడని చెప్పుకుంటారు.

సూర్యకిరణాభిషేకం

దక్షిణాయణంలో సూర్యోదయాన ఆలయ గర్భగుడిలో ఉన్న స్వామి వారి శివలింగాన్ని సూర్యకిరణాలు అభిషేకించడం విశేషం. ఉత్తరాయణంలో భ్రమరాంబ అమ్మవారి పాదాలను ఉదయ కిరణాలు స్పర్శిస్తాయి.

కొండకింద దేవుడు

మల్లయ్యకొండ కింద నేలమల్లేశ్వర స్వామి ఆలయం ఉంది. కొండ పైకి రోడ్డు సౌకర్యం లేనప్పుడు కాలినడకన కొండ ఎక్కలేని భక్తులు నేల మల్లేశ్వరస్వామిని దర్శించుకుని చేసేవారు. ఈ ప్రాంతంలోని మద్దాభక్తుని బావి వద్ద ఆంజనేయ స్వామి, వినాయకుడి ఆలయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆలయాల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి.




మహాశివరాత్రి ఉత్సవాలు

మల్లయ్యకొండలో మహాశివరాత్రి ఉత్సవాలను నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు. శివమాల ధరించినవారు కాలినడకన మల్లయ్యకొండ ఎక్కి స్వామి వారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పిస్తారు. మద్దాభక్తునిబావి వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

ఇలా వెళ్ళచ్చు...

- మల్లయ్యకొండ కింద నుంచి పైకి 8 కి.మీ మేర ఘాట్ రోడ్డు ఉంది. రాయచోటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆలయానికి రావాలంటే ముదివేడు క్రాస్‌కు వచ్చి అక్కడి నుంచి తంబళ్లపల్లెకు చేరుకోవచ్చు.
- కార్లు, ఇతర వాహనాలల్లో అయితే రెడ్డికోట క్రాస్ నుంచి కుక్కరాజుపల్లె, కోటకొండ మీదుగా తంబళ్లపల్లెకు చేరుకోవచ్చు. ఇక్కడి రాగిమాను కూడలి నుంచి కొండ పైకి ప్రయివేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.
- ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి.
- మహాశివరాత్రి పర్వదినాల్లో రాయచోటి, మదనపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యం నుంచి ఆర్టీసీ బస్సులు నడుస్తాయి.





మల్లయ్యకొండ పై ఇవి చూడండి..

- మల్లయ్యకొండపైన సహజసిద్ధంగా ఏర్పడిన నిచ్చెనకొండ, ఎలుకతీర్థం, భగీరథీ కొలను(కోనేరు), అంతర గంగ, అన్నబేధి అనే పంచ తీర్థములు ఉన్నాయి. వీటిలో ఊరిన నీటిని స్వామివారి అర్చనలు, అభిషేకానికి ఉపయోగిస్తారు.
- నిచ్చెనకొండలో ఉన్న రాతిలో ఎంతటి కరువులో నైనా నీరు ఉండటం విశేషం. భక్తులు నిచ్చెన ద్వారా ఎక్కి అందులోని నీటిని తీర్థంగా సేవిస్తారు.
- వీరన్న గెవి, చాకలివాని బావి, ఎర్రబావి(ఊటచలం) కూడా దర్శించవలసిన ప్రదేశాలు కొండపై ఉన్నాయి. సాధుకొండలోని ఓ గెవిలోంచి ఎల్లెలుకలను తోడుగా పెట్టుకుని సొరంగ మార్గం ద్వారా మల్లయ్యకొండలోని వీరన్నగెవి గుండా స్వామి బయటకు వచ్చాడని జనం నమ్మకం

ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాసం

- ఎంపీడీవోకు ఎంపీటీసీ సభ్యుల ప్రతిపాదన

బి.కొత్తకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిషత్ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ గురువారం మండలంలోని 9 మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవో శంకరయ్యకు వినతిపత్రం సమర్పించారు. 2021 సెప్టెంబరు 21న ప్రమాణస్వీకారం చేసిన తాము ఏకగ్రీవంగా ఆమెను ఎంపీపీగా ఎన్నుకున్నామని, అయితే ప్రస్తుతం ఆమె పనితీరు వల్ల ఆమెపై విశ్వాసం కోల్పోయామని, ఆమెపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నామని ఆ పత్రంలో పేర్కొన్నారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులుండగా వారిలో ఖాదర్‌వల్లి (తుమ్మణంగుట్ట), రాధ (సూరపువారిపల్లె), రామసుబ్బారెడ్డి (నాయనబావి), ఎల్లప్ప (బీరంగి), సుబ్బయ్య (బడికాయలపల్లి), గౌతమి (మొటుకుపల్లి), ఈశ్వరమ్మ (కోటావూరు), విమలమ్మ (గోళ్లపల్లి), బాలక్రిష్ణ (గట్టు) సంతకాలు చేశారు. దీనిపై ఎంపీడీవో శంకరయ్య మాట్లాడుతూ అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనను జిల్లా పరిషత్ సీఈవోకు పంపుతామని, పై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా మండలంలోని 11 మంది వైసీపీ తరఫున ఏకగ్రీవం అయినవారే. అయితే ఎంపీపీ లక్ష్మీనరసమ్మ వైసీపీతో అంటీముట్టనట్లు ఉన్న ఓ నాయకుడి కనుసన్నల్లో ఉన్నందున ఆమెపై అవిశ్వాసానికి తెరలేపినట్లు మండలంలో చర్చ జరుగుతోంది.



ఎంపీడీవో శంకరయ్యకు ప్రతిపాదిత పత్రం ఇస్తున్న ఎంపీటీసీలు

ప్రశాంతంగా బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

రాయచోటిటిటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషర్ వాసుబాబు, మెప్మా అధికారి అబ్బాస్ అలీఖాన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు రాయచోటి పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్, కెనరా, ఇండియన్ ఓవర్సీస్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, డీసీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులతో కలిసి మొత్తం 17 బ్యాంకుల అధికారులు హాజరు కాగా రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 1458 మంది లబ్ధిదారులకు గానూ 1252 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి స్వీకరించారు. దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు తెలియజేశారు.



బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన లబ్ధిదారులు

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వలి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఎస్.వి.సుబ్రమణ్యంశాస్త్రి, టి.గంగరాజు, ఉత్తన్న అనే వారు మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాలతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు జనవరి 16వ తేదీ సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సచివాలయంలో విచారణ చేశారు. రూ.45,33,124 నిధులు దుర్వినియోగం అయినట్లు డీఎల్‌పీవో నివేదిక ఇచ్చారు. దీనిపై సర్పంచ్‌ను వివరణ కోరినా స్పందించకపోవడం, బిల్లులు, ఎం.బుక్కులు సమర్పించకపోవడంతో సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ పరిపాలన, సమస్యల పరిష్కారానికి నిధులు ఖర్చు చేసే అధికారం, ఈవోఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ ఇచ్చినట్లు చెప్పారు.

గుండాలకోనకు ఆర్టీసీ బస్సు ట్రయల్ రన్

చిట్వేలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యక్షేత్రమైన గుండాలకోన కర్కటేశ్వరుడి సన్నిధికి ఇటీవల రహదారి పనులు పూర్తి కావడంతో గురువారం ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్సుతో ట్రైల్ రన్ నిర్వహించారు. ట్రైల్ విజయవంతం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మార్గానికి చాలాకాలంగా సరైన రవాణా సదుపాయం లేక కాలినడకన, ట్రాక్టర్లు, ఆటోల్లో భక్తులు వెళ్లి మొక్కులు తీర్చుకునేవారు.

ఈ సందర్భంగా గుండాలకోన ఛైర్మన్ బుంగటావుల రాజశేఖర్ మాట్లాడుతూ శివరాత్రికి గుండాలకోనలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శివరాత్రికి పెద్దూరు నుంచి గుండాలకోనకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీ నాయకుల కుటుంబాలకు ఐదేళ్లుగా తాగునీరు నిలిపివేత

- కూటమి ప్రభుత్వం వచ్చినా మారని వైసీపీ పెత్తనం
- తాగునీరు అందించాలని బాధితుల వేడుకోలు

నిమ్మనపల్లి ఫిబ్రవరి 20(ఆంధజ్యోతి): టీడీపీ కుటుంబాలకు దాదాపు ఐదేళ్లుగా గ్రామ పంచాయతి వేయించిన బోరు నుంచి తాగునీరు ఇవ్వకుండా వైసీపీ నాయకులు వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా తమకు తాగునీరు అందడంలేదని ఇలా అయితే తమ బతుకులు ఎలామారుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నిమ్మనపల్లె మండలంలోని వెగంవారిపల్లి పంచాయతి ముతకనవారిపల్లిలో తొమ్మిది కుంటుంబాల వారు జీవిస్తున్నారు. అయితే ఇందులో రెండు కుటుంబాలు మాత్రం టీడీపీ మద్దతుదారులు కాగా మిగిలిన 7కుంటుబాలు వైసీపీకి చెందిన వారు. ఐదేళ్ల క్రితం పంచాయతికి సంబంధించి తాగునీటి కోసం బోరు వేయించారు. అయితే ముతకనవారిపల్లిలో ఉండే వైసీపీ మద్దతుదారులు టీడీపీ నాయకుల కుంటుంబాలను తాగునీటిని పట్టుకోనివ్వకుండా అడ్డుకొని మీకు దిక్కున్నచోట చెప్పుకోండి అని దౌర్జన్యం చేసి బోరుకు తాళం వేసి వారి వద్దే పెట్టుకొన్నారు. దీంతో చేసేదేమి లేక పలు మార్లు పంచాయతి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో టీడీపీ నాయకులు శివగంగిరెడ్డి నారాయణరెడ్డి ఐదేళ్ల పాటు తమ సొంత వ్యవసాయ బోరు నుంచి పైపు లైన్ వేయించుకొని జీవనం సాగించారు. గతంలో కూడా టీడీపీ నాయకులు తాగునీరు ఇవ్వలేదని పలు మార్లు పంచాయతి కార్యదర్శికి పిర్యాదు చేయగా మొక్కుబడిగా గ్రామానికి వచ్చి తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపి వెళ్లిపోయారు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ముతకనవారిపల్లిలో టీడీపీ కుటుంబాలకు తాగునీరు ఇవ్వకపోవడం గమనార్హం. దీనిపై ప్రస్తుతం ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డికి బాధిత కుటుంబాలు పిర్యాదు చేయగా ఆయన గ్రామంలోకి వెళ్లగా అక్కడ గ్రామస్థులు పనులకు వెళ్లినట్లు తెలిపారు. రెండు రోజుల్లో తాగునీరు ఇవ్వకుండా నిలుపుదల చేసినందుకు పూర్తి విచారణ చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



ముతకనవారిపల్లిలో బోరుకు తాళం వేసిన దృశ్యం

తిరుపతిలో ఘోర రోడ్డు ప్రమాదం

- టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో గాలివీడు యువకుడి మృతి
- బోరెడ్డిగారిపల్లెలో విషాదఛాయలు

గాలివీడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లె పంచాయతీ కస్పాకు చెందిన యువకుడు మృతి చెందాడు. దీంతో స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల మేరకు పూర్తి వివరాలిలా..

గాలివీడు మండలం, బోరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్.ఇదయతుల్లా, రషీద దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు షాకీర్‌బాషా (21) తిరుపతిలోని విద్యానికేతన్ కళాశాలలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి తోటి విద్యార్థినితో కలిసి ద్విచక్రవాహనంలో వివాహానికి వెళ్లి వస్తుండగా నాయుడుపేట-పూతలపట్టు ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఉమెన్ స్టే హోం వద్ద వారిని టిప్పర్ ఢీకొంది. దీంతో షాకీర్‌బాషాతో పాటు గుర్తు తెలియని మరో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. కాగా గురువారం ఉదయం పోలీసులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన వెంటనే హుటాహుటిన వారు సంఘటన స్థలానికి చేరుకుని లబోదిబోమన్నారు. మృతదేహాన్ని గురువారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చారు. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం చేసి తమకు చేదోడు వాదోడుగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. చిన్నవయసులోనే నిండు నూరేళ్లు నిండిపోయాయా అంటూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలతో బోరెడ్డిగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.





మృతిచెందిన యువకుడు షాకీర్‌బాషా, షాకీర్‌బాషా (ఫైల్‌ఫొటో)

రాయచోటి సబ్‌జైలు తనిఖీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనలతో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ రాయచోటి సబ్‌జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని ఖైదీలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యత గురించి ఖైదీలకు తెలియజేశారు. అలాగే జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ సిస్టం గురించి ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయసేవా సమితిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

భార్య కాపురానికి రాలేదని యువకుడు ఆత్మహత్యాయత్నం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాలేదని ఓ యువకు డు గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలం సొన్నువారిపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బూర్లపల్లె పంచాయతీ సొన్నువారి పల్లె కు చెందిన వెంకట్రమణ కుమారుడు సోమశేఖర్ (40) అనే యువకుడు ఇదే గ్రామానికి చెందిన డేరంగుల ఓబులేసు కుమార్తె గాయత్రి ని వివాహం చేసుకున్నాడు. కాగా భార్యభర్తలు తరచు గొడవ పడుతుండేవారు. సోమశేఖర్ తాగుడుకు బానిసై తరచు భార్యను వేదిస్తుండే వాడని ఇటీవల సోమశేఖర్‌పై భార్య గాయత్రి పీటీఎం పోలీసులకు పిర్యాదు చేయడంతో వారు మందలించి పంపించారు. అయితే గురువారం ఉదయం సోమశేఖర్ అతిగా మద్యం తాగి భార్య గాయత్రితో గొడవ పడి బహిర్భూమికి వెళ్లి గొంతుకోసుకున్నాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు.



ఘటనలో తీవ్రంగా గాయపడిన సోమశేఖర్



పులివెందుల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు అన్నీ కష్టాలే.. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా కష్టాలు మాకు తప్పవంటూ నిందిస్తున్నారు. ఇటీవల వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళలను మార్పు చేశారు. మొన్నటి వరకు చలికాలంలో తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 వరకు అందించారు. ఇపుడు ఉదయం 8.15 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు 9గంటల పాటు పూర్తిగా పగటి పూట విద్యుత్ అందిస్తున్నారు. ఈ విద్యుత్ వేళలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం చలికి వణుకుతూ పొలాలకు వద్దకు వెళాల్సి వచ్చేదని... ఇప్పుడు మండుటెండలకు మాడిపోతూ పంటలకు నీళ్లు పారకట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులకు వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళల్లో ప్రభుత్వం మార్పు చేసింది. 15రోజుల క్రితం వరకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌ను అందిస్తూ వచ్చేవారు. ప్రస్తుతం ఉదయం 8.15 నుంచి సాయంత్రం 5.15 వరకు విద్యుత్ అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రస్తుతం బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ, కొర్ర, నువ్వులు, టమోట, మిరప తదితర పంటలకు నీటి తడులు అందించాలంటే పూర్తిగా ఎండలోనే గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ ద్వారా ఆ పంటకు నీరు అందించాలంటే కయ్యల రూపంలో నీటితడి అందించాల్సిందే. కాల్వ నుంచి కయ్యలోకి నీరు మళ్లించినపుడు ఆ కయ్య పది నిమిషాలకో పద్దైదు నిమిషాలకో నీరు పారుతుంది. వెంటనే పక్కనున్న మరో కయ్యకు నీటిని అందించాలి. ఇలా నీటి తడిని అందించాలంటే పూర్తిగా ఎండలోనే వుండాల్సి వస్తుందంటున్నారు. చలికాలం ఈ పద్ధతి పాటించి ఉంటే బాగుండేదని.. ఎండాకాలం ప్రారంభమవుతున్న సమయంలో ఇలా విద్యుత్ వేళలు మార్చడం ఇబ్బంది పెట్టడమేనని అంటున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి విద్యుత్ వేళల్లో మార్పు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా, విద్యుత్ వేళల మార్పులపై ఏడీఈ స్థాయి అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రభుత్వం చెప్పినట్లు విద్యుత్ వేళల్లో మార్పు చేశామని తెలిపారు. తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ వ్యవసాయానికి అందిస్తే రైతులకు, పంటలకు అనుకూలంగా ఉండేదన్నారు.

వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం

● మాల కార్పొరేషన్ చైర్మన్ ఆగ్రహం


ఎస్సీ కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మాల కార్పొరేషన్ చైర్మన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం అయిందని మాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొంకరి కమలమ్మ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేష్, అనిత దీప్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మాల యువత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భూమి కొనుగోలు పథకం కార్యక్రమం అమలు, ప్రస్తుత పనితీరు గురించి, లబ్ధిదారుల వివరాలను ఆయన కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా హరిజన అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన 3505 ఎకరాల భూమికి సంబంధించి సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో నాలుగు దశాబ్దాల క్రితం షెడ్యూల్డు కులా ల వారికి కేటాయించిన షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల నిర్వహణపై ఆరాతీశారు. దీంతోపాటు కార్పొరేషన్ కార్యక్రమాలు, ఆస్తులపై సమగ్ర నివేదిక రూపొందంచాలని కార్యనిర్వాహక సంచాలకులను రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ ఆదేశించారు. రానున్న ఐదేళ్లలో కార్పొరేషన్‌కు జవసత్వాలను నిం పేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో మాల యువత ఆర్థికాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండికోట నుంచి నీరు విడుదల


మెయిన్‌కెనాల్ నుంచి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి రైతుల అవసరాల కోసం 270 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ ద్వారా కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 24.245 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. మిగిలిన ప్రాజెక్టులకు నీరు వదలడం లేదని ఈఈ తెలిపారు.

అక్రమంగా వేపచెట్ల నరికివేత


పోలీసు స్టేషన్‌లో ఉంచిన వేపదుంగల లారీ

అట్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెడ్డిపల్లె పొలాల సమీపంలో సుమారు 40 వేపచెట్లను అనుమతి లేకుండా నరికినట్లు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తెలిపారు. ఓల్టా చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా వేప చెట్లను కోత మిషన్ల ద్వారా నరికి దుంగలను లారీకి లోడు చేస్తుండగా రెవెన్యూ సిబ్బందితో వెళ్లి దుంగల లారీని స్వాధీనం చేసుకుని ఎస్‌ఐ రామక్రిష్ణకు అప్పజెప్పినట్లు తెలిపారు. ఎవరైనా ఓల్టా చట్టాన్ని అతిక్రమించి చెట్లను నరికితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థానిక వీఆర్వో నాని, వీఆర్‌ఏ క్రిష్ణ ఉన్నారు.

గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి



లింగాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం మీదపడడంతో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకెళితే... లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి శోభ (40) శనివారం తమ పొలం లో సాగుచేసిన శనగ పంటను యంత్రం ద్వారా నూర్పిడిచేసే ప్రక్రి య పూర్తిచేసి.. ఆ తర్వాత పక్కపొలం రైతు శనగ పంట నూర్పిడి కోసం కూలీలు తక్కువగా ఉండడంతో అక్కడకు వెళ్లింది. యంత్రం పనిచేస్తున్న సమయంలో శనగలు బయటకు వచ్చే గొట్టం విద్యుత్ స్తంభం మీద పడటంతో విరిగి అక్కడే ఉన్న శోభ మీదపడడంతో కాలువిరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం సరిగా లేక మనస్థాపం చెందిన పద్మనాభరెడ్డి (58) అనే వృద్ధుడు గురువారం మదనపల్లె మండలం వలసపల్లె గ్రామంలోని కాలనీ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు మదనపల్లె మండలం, బసినికొండకు చెందిన పద్మనాభరెడ్డి కొద్దిరోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ రోగం నయం కాకపోవడంతో గురువారం ఉదయం వలసపల్లె కాలనీలోని ఖాళీ స్థలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి భార్య తోపాటు అమెరికాలో చదువుతున్న కుమారుడు యశ్వంత్‌రెడ్డి, కుమార్తె భవ్యశ్రీ ఉన్నారు. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కురబలకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ బుడ్డారెడ్డిగారిపల్లె సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. మృతుడిని గుర్తుపట్టడానికి వీల్లేకుండా శరీరం ఛిద్రమైంది. ఈ మార్గాన వెళ్లే గ్రామస్థులు గమనించి కుటుంబీకులకు, కదిరి రైల్వే పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి గాయాలు

ముద్దనూరు ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చింతకుంట సమీపంలో గురువారం ప్యాసింజర్ రైలు నుంచి ప్రమాద వశాత్తు కింద పడటంతో అర్జున్ (29)అనే యువకుడికి గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వాసి అర్జున్ వెళుతున్న ప్యాసింజర్ రైలు నుంచి జారి కిందపడ్డారు. పొలాల్లో పనిచేస్తున్న వారు గుర్తించి 108 ద్వారా క్షతగాత్రుడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తాం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం అమరావతి నుంచి గ్రూపు-2, ఇంటర్ పరీక్షలు, పి-4 సర్వే, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అంశాలపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ అన్ని జిల్లా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ ద్వారా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ గ్రూపు-2 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి ప్రగతి అనే నినాదంతో నిర్వహించే పి-4 సర్వే వచ్చే ఉగాది లోపు ప్లానింగ్ సచివాలయాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మిస్ట్రేషన్, అగ్రికల్చర్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఐవీఆర్ ద్వారా ప్రజల నుంచి ప్రజా స్పందనలు స్వీకరించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 158 సేవలు అందిస్తున్నామని... మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని వీటిపై మరింత దృష్టి సారించాలన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, పంచాయతీరాజ్ అధికారి రాజ్యలక్ష్మి, డీఈఓ షంషుద్దీన్, ఏపీపీఎస్సీ అధికారులు, విద్యాశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బీఈడీ పరీక్షలు


పరీక్షలను పర్యవేక్షిస్తున్న రిజిస్ట్రార్ పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ పరిధిలో గల కళాశాలల్లో 1,3 సెమిస్టర్ల బీఈడీ పరీక్షలు గురువారం ప్రారంభయ్యాయి. ఉమ్మడి కడప జిల్లాలో 15 కేంద్రాలను ఏర్పాటు చేయగా 4713 మంది హాజరయ్యారు. పరీక్షలను విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచా ర్య కె.ఎస్.వి.కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడపలో జరుగుతున్న ఎస్వీ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో 10 కేంద్రాల్లో, అన్నమయ్య జిల్లాలో ఐదు కేంద్రాల్లో తొలిరోజు 4713 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ), మధ్యాహ్నం 3వ సెమిస్టర్ వారికి పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పా రు. జిల్లా వ్యాప్తంగా రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నారని, అలాగే ప్రతి కేంద్రానికి అబ్జర్వర్‌ను నియమించామని తెలిపారు.

తిరుపతి టాస్క్‌ఫోర్సు అదుపులో ప్రొద్దుటూరు వ్యక్తులు?

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం ప్రొద్దుటూరులోని దస్తగిరి పేటకు చెందిన ఆరుగురు వ్యక్తులను స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు తిరుపతికి తీసుకెళ్లి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరిలో ముగ్గురు మైనర్ పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల హైదరాబాదులో డ్రగ్స్ కేసులో ప్రొద్దుటూరు దస్తగిరిపేటకు చెందిన షేక్ మహ్మద్ హనీఫ్, చాంద్‌పీర్ అనే ఇద్దరు వ్యక్తులు అరెస్టు కాగా చెంచల్‌గూడా జైలులో వున్నారు. వీరిని కస్టడీకి తీసుకొని విచారించే క్రమంలో ప్రొద్దుటూరులో మరికొంతమంది డ్రగ్స్ రాకెట్‌లో వున్నట్లు సమాచారం రావడంతో స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం సాయంత్రం దస్తగిరిపేటలోని ఓ ప్రైవేటు స్కూలు సమీపంలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. కవ్వా అనే అడ్డ పేరుగల వ్యక్తి గురించి కొందరు కొత్త వ్యక్తులు ఆ ప్రాంతంలో ఆరా తీసినట్లు కూడా స్థానికులు నిర్ధారిస్తున్నారు. అయితే స్థానికంగా ప్రొద్దుటూరు పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకనే వారిని తీసుకెళ్లారా లేదా వారికి సమాచారం ఇచ్చి పట్టుకుపోయారా అనేది పోలీసులు ధ్రువీకరించడం లేదు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు పట్టివేత

సిద్దవటం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నా పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు డేగనవారిపల్లెకు చెందిన రైతు 100 డయల్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం ఉదయం డేగనవారిపల్లె గ్రామ సమీపాన 3 ఇసుక ట్రాక్టర్లును, బండికనుమపై 2 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు శివప్రసాద్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరం పంచాయతీలో అవకతవకలు, అవినీతిపై విచారణ

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో గతంలో చోటు చేసుకున్న అవకతవకలు, అప్పటి కార్యదర్శి గురుమోహన్ అవినీతిపై వచ్చిన ఆరోపణలపైన డీఎల్‌పీవో తిమ్మక్క గురువారం సమగ్ర విచారణ చేపట్టారు. 2019-23 మధ్య కాలంలో గోపవరం కార్యదర్శి గురుమోహన్ అవినీతికి పాల్పడ్డాడని, అప్పటి మాజీ వార్డు సభ్యుడు మార్తల సుబ్బారెడ్డి, డీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. జడ్పీసీఈవో ఆదేశాల మేరకు డీఎల్‌పీవో తిమ్మక్క సుమారు మూడు నెలల కిందట విచారించి నివేదిక అందించారు. అయితే ఆ నివేదిక సక్రమంగా లేదని, నిజాలు నిగ్గు తేలలేదని ఫిర్యాది డీపీవోను ఆశ్రయించారు. దీంతో ఫిర్యాదిదారుని పిలిపించి విచారణ చేపట్టి సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు డీఎల్‌పీవో గోపవరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదిదారుడు సుబ్బారెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. గోపవరం-కొత్తపల్లె పంచాయతీ పరిధిల్లో లేఅవుట్ అప్రూవల్‌లో అక్రమాలు జరిగాయని, చెన్నకేశవ అనే వ్యక్తి దొంగ సర్టిఫికెట్‌తో రూ.15 వేలు జీతంతో సుమారు రెండున్నర సంవత్సరంపాటు విధులు నిర్వహించి పంచాయతీ ఆదాయానికి గండికొట్టారని, గ్రామ పంచాయతీలో బినామీ పేర్లతో అక్రమ వసూళ్లు చేశారని, అప్పటి కార్యదర్శి గురుమోహన్ అవినీతి సంపాదనతో ఆస్తులు కూడబెట్టారని డీఎల్‌పీవోకు వివరించారు. వీటిపై లిఖితపూర్వక ఫిర్యాదు అందిస్తూ ఆధారాలు సమర్పించాలని ఆమె కోరగా ఇదివరకే పలుమార్లు ఫిర్యాదు చేశానని, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చాలని ఫిర్యాదిదారుడు పట్టుబట్టారు. దీంతో కొన్ని రికార్డులు అందుబాటులో లేవని, ఉన్నవాటిల్లో అధికారులు పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టిన డీఎల్‌పీవో తిమ్మక్క

వంద రోజుల్లో సాగు, తాగునీరు అందిస్తాం : ఎమ్మెల్యే ఆది

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వామికొండ రిజర్వాయర్ పరిధిలో ఉన్న రైతులకు వంద రోజుల్లో సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. జీఎన్ఎస్ఎస్‌లో అంతర్భాగమైన వామికొండ రిజర్వాయర్ కింద అసంపూర్తిగా ఉన్న కాలువపనులు, భూసేకరణ తదితర అంశాలపై మాదన్నగారిపల్లె వద్ద గురువారం ఎమ్మెల్యే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయకట్టు పరిధిలోని ముద్దనూరు మండలానికి చెందిన ఉప్పలూరు, కొలవలి, ఒంటిగారిపల్లె, పెనికలపాడు, ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, కర్చుకుంటపల్లె, దండుపల్లె, వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దనపాడు, వీఎన్‌పల్లె మండలంలోని ఉరుటూరు, వెల్లుర్తి గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయర్‌లోని ఊటలు వస్తుండటంతో పంటలు పండటం లేదని ఒంటిగారిపల్లెకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ తీసేందుకు తీసుకున్న భూములకు ఒక్కోచోట ఒక్కవిధంగా నష్టపరిహారం ఇచ్చారని అందరికీ సమానంగా ఇవ్వాలని రైతులు కోరారు. మాదన్న గారిపల్లెకు చెందిన రైతులు మాట్లాడుతూ గతంలో రూ.6లక్షలు ఇచ్చారని ప్రస్తుతం రూ.22లక్షలు ధర పలుకుతోందని ఆప్రకారం ధర చెల్లిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మెయిన్ కాలువ ద్వారా నీరందడంలేదని లఫ్ట్ ద్వారా అయితే తమ పొలాలకు, చెరువులకు అందుతాయని వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దన్నపాడు రైతులు తెలిపారు. కాగా, వామికొండసాగర్‌కు 1.65 టీఎంసీల సామర్థ్యం వుందని, కుడి కాలువ కింద ఊప్పలూరు తదితర గ్రామాల్లోని 2వేల ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, వలసపల్లె, తుమ్ములపల్లె, పెద్దనపాడు, వీఎన్‌పల్లె మండలంలోని ఉరుటూరు, వెల్లుర్ది గ్రామాలకు మొత్తం 8వేల ఎకరాలకు నీరందించవచ్చని ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, ఏఈ సురేష్ రెడ్డిలు ఎమ్మెల్యేకి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే జూన్ 15నాటికి కాలువ పనులన్నీ పూర్తిచేసి రిజర్వాయర్ పరిధిలోని 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రైతులు సహకరించాలన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ వామికొండసాగర్ కింద ఉండే రైతులకు న్యాయం చేసేందుకు గతంలో కూడా పోరాడామని.. ఇప్పుడు మన ప్రభుత్వంవచ్చిందని అందరికీ న్యాయం చేస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

న్యాయమైన రేటును కల్పిస్తాం : జేసీ


రహదారి విస్తరణకు సంబంధించి పత్రాలను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి-రాయచోటి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు భూమి మార్కెట్ విలువతో పాటు న్యాయమైన రేటు కల్పించేలా అవార్డు ప్రకటిస్తామని జాయింట్ కలెక్టర్ అది తిసింగ్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో జాతీయ రహదారికి భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి అన్యాయం జరగకుండా రేటును కల్పిస్తామన్నారు. రైతులు, ప్లాట్లు యజమానులకు ప్రభుత్వ నిబంధనల మేరకే నష్టపరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు రైతులకు పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నందలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లతిమ్మయ్యగారి పల్లెలో 18 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గురువారం తన సిబ్బందితో దాడులు నిర్వహించి అక్రమంగా దాచి ఉంచిన బాటిళ్లు స్వాధీనం చేసుకుని నరసింహారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముందస్తు శివరాత్రి ఉత్సవాలు

సిద్దవటం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరి విద్యా కేంద్రంలో ముందస్తు మహాశివ రాత్రి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బి.ఓబులయ్య గురువారం మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకలు గ్రామంలో బ్రహ్మకుమారి ఈశ్వరి విద్యాలయ కేంద్రంలో జరపడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరి విశ్వవిద్యాలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో భోజనశాల ప్రారంభం

రాజంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం ఎన్టీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో టీడీపీ నేత ఆదినారాయణ ఆర్థిక సాయంతో నిర్మించిన భోజనశాలను గురువారం ప్రారంభించారు. ఎంపీడీవో వరప్రసాద్, ఎంఈవో కొండూరు రంగనాధరాజు తదితరులు భోజనశాలను ప్రారంభించి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కోసం దాత ఆర్థిక సహాయంతో విద్యార్థుల కోసం నిర్మించడం ఆనందదాయకమన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : మంత్రి


ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి

రామాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో, కుమ్మరపల్లి పంచాయతీ నడిగడ్డపల్లెలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం దృష్టి సారిస్తున్నా రన్నారు. అనంతరం టీడీపీ నాయకుడు పట్టాభిరెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు. తహసీల్దార్ రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమండెం: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ప్రజలు వివిధ సమస్యలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అందుకే ఈ కార్యక్రమం ద్వారా ఎక్కడి కక్కడే పరిష్కరిస్తున్నామన్నారు.

సంబేపల్లె: మండలంలోని దుద్యాల పర్యటన సందర్భంగా మంత్రి దృష్టికి పలు సమస్యలు తెలియజేశారు. పెద్దజంగంపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రస్తుత ప్రభుత్వ విద్యా విధానం వల్ల ఎదురవుతున్న సమస్యలను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల సౌలభ్యం కోసం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పెద్దజంగంపల్లికి చెందిన మద్దిరాల రమణయ్య ఇటీవల ఓ ప్రమాదంలో తన కాలు తీసివేయడంతో తనను ఆదుకోవాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్థానిక నాయకుల సమక్షంలో అక్కడికక్కడే రూ.25 వేల నగదును అందించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేశ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి, రాజారెడ్డి, సహదేవ, శివప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1,91,913లు చెక్కును సంబేపల్లె మండల కేంద్రానికి చెందిన యండపల్లి శ్వేత అనే బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందన్నారు.

డీఎఫ్‌వోతో టీడీపీ నేత జీఎన్ భేటీ


డీఎఫ్‌వోను అభినందిస్తున్న డాక్టర్ జీఎన్ నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫారెస్ట్ అధికారి జగన్నాద్‌సింగ్‌తో రాష్ట్ర టీడీపీ సీనియర్ నేత, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ అధినేత డాక్టర్ జీఎన్‌నాయుడు గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీశాఖ సంరక్షణ, ప్రధానంగా రాజంపేట డివిజన్ పరిధిలోని శేషాచలం కొండల్లో ఎర్రచందనం సంరక్షణ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై చర్చించారు. యువ ఐఎఫ్ఎస్ అధికారిగా ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎర్రచందనం నిల్వలు ఉన్న రాజంపేట డివిజన్‌లో జగన్నాద్ సింగ్‌ను నియమించడం పట్ల ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కౌలు రైతులను ఆదుకోండి

- కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రుణాలు మంజూరు చేసి తీవ్ర నష్టాలతో ఇబ్బందులు పడుతున్న కౌలు రైతులను ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీలో కౌలు రైతుల సంఘం ఆదేశాల మేరకు గురువారం ఆయన రైతు సంఘం రాయచోటి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు హరినాధనాయుడు, బాలక్రిష్ణారెడ్డి, రమణ, లక్ష్మిరెడ్డిలతో కలిసి ఎస్‌బీఐ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులు గణనీయంగా ఉన్నారని. పంట సాగుదారు హక్కు చట్టం 2019 ప్రకారం వారిని గుర్తించాలని వినతిపత్రంలో కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి : రమేశ్‌నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కేంద్ర పథకాల నిధులు దుర్వినియోగంపై వెంటనే విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వెంటనే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేసి దోషులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు రమణ, పాపయ్య, నవీన్‌కుమార్, సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బీసీల సంక్షేమానికి నిరంతరం కృషి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మయాదవ్


నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షురాలు పద్మయాదవ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు పద్మయాదవ్ అన్నారు. గురువారం ఆమె బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో పలువురిని జిల్లా కార్యవర్గంలో నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకట్రమణ యాదవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నాగేశ్వర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రబాబు, జిల్లా సెక్రటరీగా మల్లికార్జున, జిల్లా మహిళా సెక్రటరీగా లక్ష్మికళ, రాయచోటి డివిజన్ ప్రెసిడెంట్‌గా నాగరాజ, జనరల్ సెక్రటరీగా జయరాం, వైస్ ప్రెసిడెంట్‌గా రమణ, తాలూకా సెక్రటరీగా పదిలం లలిత, నరసింహానాయుడులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా బీసీలను ఏకతాటిపై తీసుకువచ్చి రాజ్యాంగం వైపు అడుగులు వేసే విధంగా సమష్టిగా కృషి చేస్తామన్నారు. అలాగే బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీసీలంతా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను తీర్చాలి


ఏఈ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నేతలు

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట డివిజన్ పరిధిలో విద్యుత్ కార్మికులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని గురువారం సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ చంద్రశేఖర్‌కు విద్యుత్‌శాఖ యూనియన్ కాంట్రాక్టు నేత వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొబ్బురేవారిపల్లెలో నూతనంగా ప్రారంభించిన సబ్‌స్టేషన్‌లో పసుపులేటి గంగాధర్‌సాయి గత 14 నెలలుగా పనిచేస్తున్నారని, ఏ కారణాలు చూపకుండా తొలగించడం సరికాదన్నారు. అతన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బాలక్రిష్ణ, హరి, సురేంద్ర, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన

మండలంలోని గొబ్బూరువారిపల్లె సబ్‌స్టేషన్ కార్యాలయంలో షిఫ్టు ఆపరేటర్‌గా పనిచేస్తున్న గంగాధర్‌సాయిని విధుల నుంచి తొలగించడం సరికాదని, ఆయనను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

- ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం డిమాండ్


రాయచోటిలో సమ్మె చేస్తున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

రాయచోటిటౌన్/రాజంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీలో గత ఏడేళ్లుగా 15 వేల మంది ఉద్యోగుల సంఖ్య తగ్గిందని, సంస్థ కోసం, పాలసీదారుల కోసం తక్షణం నూతన నియామకాలు చేపట్టాల్సిందేనని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం రాయచోటి డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విశ్వనాథ్, డి.ఆదినారాయణరెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం రాయచోటి పట్టణంలోని ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం ఒక గంట పాటు సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నేతలు, తదితర ప్రజాసంఘాలు పాల్గొన్నారు.

రాజంపేటలో.. రాజంపేట ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఎల్‌ఐసీ ఉద్యోగులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట రాజంపేట ఎల్‌ఐసీ ఉద్యోగులు ఒక గంట పాటు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాజంపేట బ్రాంచ్ ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి జి.రామక్రిష్ణారెడ్డి, అధ్యక్షులు సుభాష్‌చంద్రలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగాధర్, రాఘవేంద్ర, రాంప్రసాద్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

భగ్గుమన్న అక్రమ కట్టడాల కూల్చివేతల వివాదం

రాజంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ భవన నిర్మాణాల వివాదం ఒక్కసారిగా భగ్గుమంది. వారం రోజుల కిందట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం తాళ్లపాక చెరువును ఆక్రమించారని పేర్కొంటూ కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాల ప్రహరీగోడను కూల్చివేశారు. ఎన్టీఆర్ కాలనీకి ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్సు అక్రమ నిర్మాణాలను రెండు రోజులుగా ఎక్సకవేటర్లు, హిటాచీలు ఏర్పాటు చేసి పూర్తిగా నేల మట్టం చేశారు. బుధ, గురువారం షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణాలతో పాటు, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కట్టడాలను రెవెన్యూ అధికారులు దగ్గరుండి కూల్చివేశారు. దీంతో కొందరు దళితులు ఆందోళన తెలిపారు. కాగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైసీపీ నేతలు, న్యాయవాదులతో కలిసి నిర్మాణాలు కూల్చివేసిన ప్రాంతాలను పరిశీలించారు.

2న బోల మల్లేశ్వరస్వామి కల్యాణం

నందలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాయలపల్లె గ్రామంలోని బోల మల్లేశ్వరస్వామి దేవాలయంలో కామాక్షి సమేత బోల మల్లేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, చింతకాయల గంగినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2వ తేదీ ఆదివారం ఉదయం అభిషేకాలు, పూజా కార్యక్రమాల అనంతరం 10 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, రాత్రి 9 గంటలకు ఆర్కెస్ట్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బండలాడుగుడు పోటీలు ఉంటాయన్నారు.

పోలీసుల విస్తృత గాలింపు

సిద్దవటం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి నిర్మలగిరి కాలనీ వద్ద బుధవారం ఉదయం ఆర్‌ఎంపీ వీరభద్రుడు ఇంట్లో జరిగిన చోరీల ఆచూకి కోసం పోలీసులు విస్తృత గాలింపు చేపడుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో చోరీదారులను గుర్తించేందుకు కడప, తిరుపతి పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేస్తున్నామన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సుండుపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సభాభవనంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు రాజమ్మ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- బ్యాంకు మేనేజర్ మస్తాన్‌వలి

సుండుపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు సేవలను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుండుపల్లె కెనరా బ్యాంకు మేనేజర్ మస్తాన్‌వలి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సుండుపల్లెలోని కరపత్రాలు పంపిణీ చేసి బ్యాంకు సేవలను ప్రచారం నిర్వహించారు. కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌గా భరత్‌కుమార్‌రాజు

సుండుపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని సుండుపల్లె-2 ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా భరత్‌కుమార్‌రాజును నియమించినట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉపాధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని పేదలకు పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

గాలివీడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద గురువారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులునాయక్, శివానాయక్‌లు తెలిపారు. పాఠశాల చుట్టుపక్కల నివాసం ఉండేవారు, దుకాణదారులు చెత్తాచెదారం, వ్యర్థాలను పాఠశాల ముందు వేయడంతో దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో అక్కడ చెత్తాచెదారం వేస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే అనేకమార్లు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహిద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యపూజకోన రహదారికి మరమ్మతులు


మట్టిని చదును చేస్తున్న దృశ్యం

సిద్దవటం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజకోనకు వెళ్లే రహదారి పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా నిత్యపూజకోనకు వెళ్లే రహదారి పనులు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం పనులు చేపట్టారు. ఆశ్రమం వద్ద నుంచి 9 కి.మీ. వరకు నూతిరాయికోన, పంచలింగాల వరకు పనులు చేపడుతున్నారు. రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. పంచలింగాల గుడి వద్ద తాత్కాలికంగా మరుగుదొడ్లు, టాయిలెట్ గదులు ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ ఏఈ గంగిరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో రూ.5 లక్షలతో పనులు చేస్తున్నామని, ఆదివారం లోపు పూర్తవుతాయన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- 24న కలెక్టరేట్ వద్ద ధర్నా


రాజంపేటటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భవననిర్మాణ కార్మిక సంక్షేమ మండలి బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో కలెక్టరేట్ ధర్నాపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలవుతున్నా సమస్యలపై పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 24న చేపట్టే ధర్నా కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

'దళితులపై దాడులను అరికట్టాలి'


చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోశాలదేవి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దళితులపై అగ్రవర్ణాల వారు చేస్తున్న దాడులను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గోశాలదేవి కోరారు. ఈ మేరకు ఏపీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెద్దపూడి విజయ్ కుమార్‌ను కడపలో గురువారం ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమె వెంట సీనియర్ నాయకుడు శాంతయ్య ఉన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌తో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్సీలకు ప్రతి కుటుంబానికి 2 ఎకరాల భూమిని ఇవ్వాలని కోరారు. ఇందుకు చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు నన్నం గణేష్ పాల్గొన్నారు.

అందాల అడవిలో మూడు కొండల మల్లన్న



తంబళ్లపల్లె, ఆంధ్రజ్యోతి

తంబళ్లపల్లెకు సమీపంలో సముద్ర మట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో మల్లయ్యకొండపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని విజయనగరరాజు వీరదేవరాయ-1 ధన సహాయంతో ఏకిల దొరలు నిర్మించినట్లు చెబుతోంది. శిథిలస్థితికి చేరుకున్న మల్లయ్యకొండ ఆలయాన్ని మూడేళ్ల కిందట పునరుద్ధరించారు. ఆలయ మండపంలో కుడి వైపున వీరభద్ర స్వామి, ఎడమ వైపున పార్వతీదేవి ఉన్నారు.


శివలింగం

గౌరమ్మ గుడి



మల్లయ్యకొండ ఆలయం నుంచి ఉత్తరం దిక్కులో అర కిలోమీటరు ఎగువన గౌరమ్మ ఆలయం ఉంది. సంతానం లేని మహిళలు, వివాహం కాని స్త్రీలు కోనేటిలో స్నానమాచరించి తడి బట్టలతో అమ్మవారికి వరపడతారు. గుడి దగ్గర ఉన్న చెట్లకు ముడుపులు(ఊయలలు) కట్టి, చిన్న రాళ్లను ఒకదానిపై ఒకటి పేర్చి కోర్కెలు తీరాలని మొక్కుకుంటారు. ఆలయంకు ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడి నుంచి చూస్తే సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుమల కొండలు కనపడుతాయి.

గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్


మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయం

మూడు కొండల మల్లన్న మీద అన్నమయ్య జిల్లావాసులకు అనంతమైన గురి. ఏ కష్టం వచ్చినా మల్లన్నకు మొక్కుకుంటే చాలు అనే నమ్మకం. తంబళ్లపల్లె సమీపంలోని సాధు, ఇనుము, మల్లయ్యకొండలపై వెలసిన ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తుంటారు. ఈ శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధమవుతున్నాయి.

కొండకింద దేవుడు

మల్లయ్యకొండ కింద నేలమల్లేశ్వర స్వామి ఆలయం ఉంది. కొండ పైకి రోడ్డు సౌకర్యం లేనప్పుడు కాలినడకన కొండ ఎక్కలేని భక్తులు నేల మల్లేశ్వరస్వామిని దర్శించుకుని చేసేవారు. ఈ ప్రాంతంలోని మద్దాభక్తుని బావి వద్ద ఆంజనేయ స్వామి, వినాయకుడి ఆలయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆలయాల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి.



ఏనుగు మల్లమ్మకు తొలి పూజ



మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఒక కిలో మీటరు దిగువన మల్లికార్జున స్వామి సోదరిగా భావించే ఏనుగుమల్లమ్మ ఆలయం ఉంది. అందంగా లేదని చెల్లెలు ఏనుగు మల్లమ్మను శివయ్య పెళ్లిచూపులకు తన వెంట రావద్దని చెప్పడంతో ఆమె అలిగి ఇక్కడ శిలగా మారిందని ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. చెల్లెలిని శాంతపరచడానికి తొలి పూజ నీకే దక్కుతుందని శివుడు ఆదేశించాడని చెప్పుకుంటారు.

గౌరీ నోము

కార్తీకమాసంలో భక్తులు ఆలయంలో ఒక రోజు రాత్రి నిద్ర చేసి, వేకువనే కోనేరులో స్నానమాచరించి సూర్యోదయాన స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కార్తీక సోమవారాల్లో వేల మంది ఉపవాసంతో కొండకు వెళ్లి కేదారేశ్వర గౌరీ నోములు నోచుకుంటారు. మహిళలు ఆలయ ధ్వజ స్తంభం వద్ద నేతి దీపాలు వెలిగించి కోర్కెలు నెరవేరాలని వేడుకుంటారు.

సూర్యకిరణాభిషేకం

దక్షిణాయణంలో సూర్యోదయాన ఆలయ గర్భగుడిలో ఉన్న స్వామి వారి శివలింగాన్ని సూర్యకిరణాలు అభిషేకించడం విశేషం. ఉత్తరాయణంలో భ్రమరాంబ అమ్మవారి పాదాలను ఉదయ కిరణాలు స్పర్శిస్తాయి.



మహాశివరాత్రి ఉత్సవాలు

మల్లయ్యకొండలో మహాశివరాత్రి ఉత్సవాలను నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు. శివమాల ధరించినవారు కాలినడకన మల్లయ్యకొండ ఎక్కి స్వామి వారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పిస్తారు. మద్దాభక్తునిబావి వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

ఇలా వెళ్ళచ్చు...

- మల్లయ్యకొండ కింద నుంచి పైకి 8 కి.మీ మేర ఘాట్ రోడ్డు ఉంది. రాయచోటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆలయానికి రావాలంటే ముదివేడు క్రాస్‌కు వచ్చి అక్కడి నుంచి తంబళ్లపల్లెకు చేరుకోవచ్చు.
- కార్లు, ఇతర వాహనాలల్లో అయితే రెడ్డికోట క్రాస్ నుంచి కుక్కరాజుపల్లె, కోటకొండ మీదుగా తంబళ్లపల్లెకు చేరుకోవచ్చు. ఇక్కడి రాగిమాను కూడలి నుంచి కొండ పైకి ప్రయివేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.
- ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి.
- మహాశివరాత్రి పర్వదినాల్లో రాయచోటి, మదనపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యం నుంచి ఆర్టీసీ బస్సులు నడుస్తాయి.



మల్లయ్యకొండ పై ఇవి చూడండి..

- మల్లయ్యకొండపైన సహజసిద్ధంగా ఏర్పడిన నిచ్చెనకొండ, ఎలుకతీర్థం, భగీరథీ కొలను(కోనేరు), అంతర గంగ, అన్నబేధి అనే పంచ తీర్థములు ఉన్నాయి. వీటిలో ఊరిన నీటిని స్వామివారి అర్చనలు, అభిషేకానికి ఉపయోగిస్తారు.
- నిచ్చెనకొండలో ఉన్న రాతిలో ఎంతటి కరువులో నైనా నీరు ఉండటం విశేషం. భక్తులు నిచ్చెన ద్వారా ఎక్కి అందులోని నీటిని తీర్థంగా సేవిస్తారు.
- వీరన్న గెవి, చాకలివాని బావి, ఎర్రబావి(ఊటచలం) కూడా దర్శించవలసిన ప్రదేశాలు కొండపై ఉన్నాయి. సాధుకొండలోని ఓ గెవిలోంచి ఎల్లెలుకలను తోడుగా పెట్టుకుని సొరంగ మార్గం ద్వారా మల్లయ్యకొండలోని వీరన్నగెవి గుండా స్వామి బయటకు వచ్చాడని జనం నమ్మకం

ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాసం

- ఎంపీడీవోకు ఎంపీటీసీ సభ్యుల ప్రతిపాదన

బి.కొత్తకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిషత్ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ గురువారం మండలంలోని 9 మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవో శంకరయ్యకు వినతిపత్రం సమర్పించారు. 2021 సెప్టెంబరు 21న ప్రమాణస్వీకారం చేసిన తాము ఏకగ్రీవంగా ఆమెను ఎంపీపీగా ఎన్నుకున్నామని, అయితే ప్రస్తుతం ఆమె పనితీరు వల్ల ఆమెపై విశ్వాసం కోల్పోయామని, ఆమెపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నామని ఆ పత్రంలో పేర్కొన్నారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులుండగా వారిలో ఖాదర్‌వల్లి (తుమ్మణంగుట్ట), రాధ (సూరపువారిపల్లె), రామసుబ్బారెడ్డి (నాయనబావి), ఎల్లప్ప (బీరంగి), సుబ్బయ్య (బడికాయలపల్లి), గౌతమి (మొటుకుపల్లి), ఈశ్వరమ్మ (కోటావూరు), విమలమ్మ (గోళ్లపల్లి), బాలక్రిష్ణ (గట్టు) సంతకాలు చేశారు. దీనిపై ఎంపీడీవో శంకరయ్య మాట్లాడుతూ అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనను జిల్లా పరిషత్ సీఈవోకు పంపుతామని, పై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా మండలంలోని 11 మంది వైసీపీ తరపున ఏకగ్రీవం అయినవారే. అయితే ఎంపీపీ లక్ష్మీనరసమ్మ వైసీపీతో అంటీముట్టనట్లు ఉన్న ఓ నాయకుడి కనుసన్నల్లో ఉన్నందున ఆమెపై అవిశ్వాసానికి తెరలేపినట్లు మండలంలో చర్చ జరుగుతోంది.


ఎంపీడీవో శంకరయ్యకు ప్రతిపాదిత పత్రం ఇస్తున్న ఎంపీటీసీలు

ప్రశాంతంగా బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

రాయచోటిటిటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషర్ వాసుబాబు, మెప్మా అధికారి అబ్బాస్ అలీఖాన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు రాయచోటి పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్, కెనరా, ఇండియన్ ఓవర్సీస్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, డీసీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులతో కలిసి మొత్తం 17 బ్యాంకుల అధికారులు హాజరు కాగా రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 1458 మంది లబ్ధిదారులకు గానూ 1252 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి స్వీకరించారు. దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు తెలియజేశారు.


బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన లబ్ధిదారులు

టీడీపీ నాయకుల కుటుంబాలకు ఐదేళ్లుగా తాగునీరు నిలిపివేత

- కూటమి ప్రభుత్వం వచ్చినా మారని వైసీపీ పెత్తనం
- తాగునీరు అందించాలని బాధితుల వేడుకోలు

నిమ్మనపల్లి ఫిబ్రవరి 20(ఆంధజ్యోతి): టీడీపీ కుటుంబాలకు దాదాపు ఐదేళ్లుగా గ్రామ పంచాయతి వేయించిన బోరు నుంచి తాగునీరు ఇవ్వకుండా వైసీపీ నాయకులు వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా తమకు తాగునీరు అందడంలేదని ఇలా అయితే తమ బతుకులు ఎలామారుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నిమ్మనపల్లె మండలంలోని వెగంవారిపల్లి పంచాయతి ముతకనవారిపల్లిలో తొమ్మిది కుంటుంబాల వారు జీవిస్తున్నారు. అయితే ఇందులో రెండు కుటుంబాలు మాత్రం టీడీపీ మద్దతుదారులు కాగా మిగిలిన 7కుంటుబాలు వైసీపీకి చెందిన వారు. ఐదేళ్ల క్రితం పంచాయతికి సంబంధించి తాగునీటి కోసం బోరు వేయించారు. అయితే ముతకనవారిపల్లిలో ఉండే వైసీపీ మద్దతుదారులు టీడీపీ నాయకుల కుంటుంబాలను తాగునీటిని పట్టుకోనివ్వకుండా అడ్డుకొని మీకు దిక్కున్నచోట చెప్పుకోండి అని దౌర్జన్యం చేసి బోరుకు తాళం వేసి వారి వద్దే పెట్టుకొన్నారు. దీంతో చేసేదేమి లేక పలు మార్లు పంచాయతి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో టీడీపీ నాయకులు శివగంగిరెడ్డి నారాయణరెడ్డి ఐదేళ్ల పాటు తయ సొంత వ్యవసాయ బోరు నుంచి పైపు లైన్ వేయించుకొని జీవనం సాగించారు. గతంలో కూడా టీడీపీ నాయకులు తాగునీరు ఇవ్వలేదని పలు మార్లు పంచాయతి కార్యదర్శికి పిర్యాదు చేయగా మొక్కుబడిగా గ్రామానికి వచ్చి తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపి వెళ్లిపోయారు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ముతకనవారిపల్లిలో టీడీపీ కుటుంబాలకు తాగునీరు ఇవ్వకపోవడం గమనార్హం. దీనిపై ప్రస్తుతం ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డికి బాధిత కుటుంబాలు పిర్యాదు చేయగా ఆయన గ్రామంలోకి వెళ్లగా అక్కడ గ్రామస్తులు పనులకు వెళ్లినట్లు తెలిపారు. రెండు రోజుల్లో తాగునీరు ఇవ్వకుండా నిలుపుదల చేసినందుకు పూర్తి విచారణ చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.


ముతకనవారిపల్లిలో బోరుకు తాళం వేసిన దృశ్యం

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వలి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఎస్.వి.సుబ్రమణ్యంశాస్త్రి, టి.గంగరాజు, ఉత్తన్న అనే వారు మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాలతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు జనవరి 16వ తేదీ సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సచివాలయంలో విచారణ చేశారు. రూ.45,33,124 నిధులు దుర్వినియోగం అయినట్లు డీఎల్‌పీవో నివేదిక ఇచ్చారు. దీనిపై సర్పంచ్‌ను వివరణ కోరినా స్పందించకపోవడం, బిల్లులు, ఎం.బుక్కులు సమర్పించకపోవడంతో సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ పరిపాలన, సమస్యల పరిష్కారానికి నిధులు ఖర్చు చేసే అధికారం, ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ ఇచ్చినట్లు చెప్పారు.

గుండాలకోనకు ఆర్టీసీ బస్సు ట్రయల్ రన్

చిట్వేలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యక్షేత్రమైన గుండాలకోన కర్కటేశ్వరుడి సన్నిధికి ఇటీవల రహదారి పనులు పూర్తి కావడంతో గురువారం ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్సుతో ట్రైల్ రన్ నిర్వహించారు. ట్రైల్ విజయవంతం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మార్గానికి చాలాకాలంగా సరైన రవాణా సదుపాయం లేక కాలినడకన, ట్రాక్టర్లు, ఆటోల్లో భక్తులు వెళ్లి మొక్కులు తీర్చుకునేవారు.

ఈ సందర్భంగా గుండాలకోన చైర్మన్ బుంగటావుల రాజశేఖర్ మాట్లాడుతూ శివరాత్రికి గుండాలకోనలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శివరాత్రికి పెద్దూరు నుంచి గుండాలకోనకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

తిరుపతిలో ఘోర రోడ్డు ప్రమాదం

- టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో గాలివీడు యువకుడి మృతి
- బోరెడ్డిగారిపల్లెలో విషాదఛాయలు

గాలివీడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లె పంచాయతీ కస్పాకు చెందిన యువకుడు మృతి చెందాడు. దీంతో స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల మేరకు పూర్తి వివరాలిలా..

గాలివీడు మండలం, బోరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్.ఇదయతుల్లా, రషీద దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు షాకీర్‌బాషా (21) తిరుపతిలోని విద్యానికేతన్ కళాశాలలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి తోటి విద్యార్థినితో కలిసి ద్విచక్రవాహనంలో వివాహానికి వెళ్లి వస్తుండగా నాయుడుపేట-పూతలపట్టు ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఉమెన్ స్టే హోం వద్ద వారిని టిప్పర్ ఢీకొంది. దీంతో షాకీర్‌బాషాతో పాటు గుర్తు తెలియని మరో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. కాగా గురువారం ఉదయం పోలీసులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన వెంటనే హుటాహుటిన వారు సంఘటన స్థలానికి చేరుకుని లబోదిబోమన్నారు. మృతదేహాన్ని గురువారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చారు. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం చేసి తమకు చేదోడు వాదోడుగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. చిన్నవయసులోనే నిండు నూరేళ్లు నిండిపోయాయా అంటూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోధనలతో బోరెడ్డిగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతిచెందిన యువకుడు షాకీర్‌బాషా, షాకీర్‌బాషా (ఫైల్‌ఫొటో)

రాయచోటి సబ్‌జైలు తనిఖీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనలతో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ రాయచోటి సబ్‌జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని ఖైదీలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యత గురించి ఖైదీలకు తెలియజేశారు. అలాగే జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ సిస్టం గురించి ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయసేవా సమితిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

భార్య కాపురానికి రాలేదని యువకుడు ఆత్మహత్యాయత్నం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాలేదని ఓ యువకు డు గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలం సొన్నువారిపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బూర్లపల్లె పంచాయతీ సొన్నువారిపల్లె కు చెందిన వెంకట్రమణ కుమారుడు సోమశేఖర్ (40) అనే యువకుడు ఇదే గ్రామానికి చెందిన డేరంగుల ఓబులేసు కుమార్తె గాయత్రి ని వివాహం చేసుకున్నాడు. కాగా భార్యభర్తలు తరచు గొడవ పడుతుండేవారు. సోమశేఖర్ తాగుడుకు బానిసై తరచు భార్యను వేధిస్తుండే వాడని ఇటీవల సోమశేఖర్‌పై భార్య గాయత్రి పీటీఎం పోలీసులకు పిర్యాదు చేయడంతో వారు మందలించి పంపించారు. అయితే గురువారం ఉదయం సోమశేఖర్ అతిగా మద్యం తాగి భార్య గాయత్రితో గొడవ పడి బహిర్భూమికి వెళ్లి గొంతుకోసుకున్నాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు.


ఘటనలో తీవ్రంగా గాయపడిన సోమశేఖర్



పులివెందుల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు అన్నీ కష్టాలే.. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా కష్టాలు మాకు తప్పవంటూ నిందిస్తున్నారు. ఇటీవల వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళలను మార్పు చేశారు. మొన్నటి వరకు చలికాలంలో తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 వరకు అందించారు. ఇపుడు ఉదయం 8.15 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు 9గంటల పాటు పూర్తిగా పగటి పూట విద్యుత్ అందిస్తున్నారు. ఈ విద్యుత్ వేళలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం చలికి వణుకుతూ పొలాలకు వద్దకు వెళాల్సి వచ్చేదని... ఇప్పుడు మండుటెండలకు మాడిపోతూ పంటలకు నీళ్ల పారకట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులకు వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళల్లో ప్రభుత్వం మార్పు చేసింది. 15రోజుల క్రితం వరకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌ను అందిస్తూ వచ్చేవారు. ప్రస్తుతం ఉదయం 8.15 నుంచి సాయంత్రం 5.15 వరకు విద్యుత్ అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రస్తుతం బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ, కొర్ర, నువ్వులు, టమోట, మిరప తదితర పంటలకు నీటి తడులు అందించాలంటే పూర్తిగా ఎండలోనే గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ ద్వారా ఆ పంటకు నీరు అందించాలంటే కయ్యల రూపంలో నీటితడి అందించాల్సిందే. కాల్వ నుంచి కయ్యలోకి నీరు మళ్లించినపుడు ఆ కయ్య పది నిమిషాలకో పదైదు నిమిషాలకో నీరు పారుతుంది. వెంటనే పక్కనున్న మరో కయ్యకు నీటిని అందించాలి. ఇలా నీటి తడిని అందించాలంటే పూర్తిగా ఎండలోనే వుండాల్సి వస్తుందంటున్నారు. చలికాలం ఈ పద్ధతి పాటించి ఉంటే బాగుండేదని.. ఎండాకాలం ప్రారంభమవుతున్న సమయంలో ఇలా విద్యుత్ వేళలు మార్చడం ఇబ్బంది పెట్టడమేనని అంటున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి విద్యుత్ వేళల్లో మార్పు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా, విద్యుత్ వేళల మార్పులపై ఏడీఈ స్థాయి అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రభుత్వం చెప్పినట్లు విద్యుత్ వేళల్లో మార్పు చేశామని తెలిపారు. తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ వ్యవసాయానికి అందిస్తే రైతులకు, పంటలకు అనుకూలంగా ఉండేదన్నారు.

వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం


● మాల కార్పొరేషన్ చైర్మన్ ఆగ్రహం


ఎస్సీ కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మాల కార్పొరేషన్ చైర్మన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం అయిందని మాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొంకరి కమలమ్మ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేష్, అనిత దీప్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మాల యువత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భూమి కొనుగోలు పథకం కార్యక్రమం అమలు, ప్రస్తుత పనితీరు గురించి, లబ్ధిదారుల వివరాలను ఆయన కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా హరిజన అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన 3505 ఎకరాల భూమికి సంబంధించి సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో నాలుగు దశాబ్దాల క్రితం షెడ్యూల్డు కులా ల వారికి కేటాయించిన షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల నిర్వహణపై ఆరాతీశారు. దీంతో పాటు కార్పొరేషన్ కార్యక్రమాలు, ఆస్తులపై సమగ్ర నివేదిక రూపొందంచాలని కార్యనిర్వాహక సంచాలకులను రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ ఆదేశించారు. రానున్న ఐదేళ్లలో కార్పొరేషన్‌కు జవసత్వాలను నిం పేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో మాల యువత ఆర్థికాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండికోట నుంచి నీరు విడుదల


మెయిన్‌కెనాల్ నుంచి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి రైతుల అవసరాల కోసం 270 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ ద్వారా కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 24.245 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. మిగిలిన ప్రాజెక్టులకు నీరు వదలడం లేదని ఈఈ తెలిపారు.

అక్రమంగా వేపచెట్ల నరికివేత


పోలీసు స్టేషన్‌లో ఉంచిన వేపదుంగల లారీ

అట్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెడ్డిపల్లె పొలాల సమీపంలో సుమారు 40 వేపచెట్లను అనుమతి లేకుండా నరికినట్లు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తెలిపారు. ఓల్టా చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా వేప చెట్లను కోత మిషన్ల ద్వారా నరికి దుంగలను లారీకి లోడు చేస్తుండగా రెవెన్యూ సిబ్బందితో వెళ్లి దుంగల లారీని స్వాధీనం చేసుకుని ఎస్ఐ రామక్రిష్ణకు అప్పజెప్పినట్లు తెలిపారు. ఎవరైనా ఓల్టా చట్టాన్ని అతిక్రమించి చెట్లను నరికితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థానిక వీఆర్వో నాని, వీఆర్ఏ క్రిష్ణ ఉన్నారు.

గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి



లింగాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం మీదపడడంతో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకెళితే... లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి శోభ (40) శనివారం తమ పొలం లో సాగుచేసిన శనగ పంటను యంత్రం ద్వారా నూర్పిడిచేసే ప్రక్రి య పూర్తిచేసి.. ఆ తర్వాత పక్కపొలం రైతు శనగ పంట నూర్పిడి కోసం కూలీలు తక్కువగా ఉండడంతో అక్కడకు వెళ్లింది. యంత్రం పనిచేస్తున్న సమయంలో శనగలు బయటకు వచ్చే గొట్టం విద్యుత్ స్తంభం మీద పడటంతో విరిగి అక్కడే ఉన్న శోభ మీదపడడంతో కాలువిరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం సరిగా లేక మనస్థాపం చెందిన పద్మనాభరెడ్డి (58) అనే వృద్ధుడు గురువారం మదనపల్లె మండలం వలసపల్లె గ్రామంలోని కాలనీ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు మదనపల్లె మండలం, బసినికొండకు చెందిన పద్మనాభరెడ్డి కొద్దిరోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ రోగం నయం కాకపోవడంతో గురువారం ఉదయం వలసపల్లె కాలనీలోని ఖాళీ స్థలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి భార్య తోపాటు అమెరికాలో చదువుతున్న కుమారుడు యశ్వంత్‌రెడ్డి, కుమార్తె భవ్యశ్రీ ఉన్నారు. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కురబలకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ బుడ్డారెడ్డిగారిపల్లె సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. మృతుడిని గుర్తుపట్టడానికి వీల్లేకుండా శరీరం ఛిద్రమైంది. ఈ మార్గాన వెళ్లే గ్రామస్థులు గమనించి కుటుంబీకులకు, కదిరి రైల్వే పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి గాయాలు

ముద్దనూరు ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చింతకుంట సమీపంలో గురువారం ప్యాసింజర్ రైలు నుంచి ప్రమాద వశాత్తు కింద పడటంతో అర్జున్ (29)అనే యువకుడికి గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వాసి అర్జున్ వెళుతున్న ప్యాసింజర్ రైలు నుంచి జారి కిందపడ్డారు. పొలాల్లో పనిచేస్తున్న వారు గుర్తించి 108 ద్వారా క్షతగాత్రుడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తాం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం అమరాతి నుంచి గ్రూపు-2, ఇంటర్ పరీక్షలు, పి-4 సర్వే, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అంశాలపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ అన్ని జిల్లా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ ద్వారా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ గ్రూపు-2 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి ప్రగతి అనే నినాదంతో నిర్వహించే పి-4 సర్వే వచ్చే ఉగాది లోపు ప్లానింగ్ సచివాలయాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అగ్రికల్చర్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఐవీఆర్ ద్వారా ప్రజల నుంచి ప్రజా స్పందనలు స్వీకరించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 158 సేవలు అందిస్తున్నామని... మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని వీటిపై మరింత దృష్టి సారించాలన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, పంచాయతీరాజ్ అధికారి రాజ్యలక్ష్మి, డీఈఓ షంషుద్దీన్, ఏపీపీఎస్సీ అధికారులు, విద్యాశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బీఈడీ పరీక్షలు


పరీక్షలను పర్యవేక్షిస్తున్న రిజిస్ట్రార్ పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ పరిధిలో గల కళాశాలల్లో 1,3 సెమిస్టర్ల బీఈడీ పరీక్షలు గురువారం ప్రారంభయ్యాయి. ఉమ్మడి కడప జిల్లాలో 15 కేంద్రాలను ఏర్పాటు చేయగా 4713 మంది హాజరయ్యారు. పరీక్షలను విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచా ర్య కె.ఎ.వి.కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడపలో జరుగుతున్న ఎస్వీ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో 10 కేంద్రాల్లో, అన్నమయ్య జిల్లాలో ఐదు కేంద్రాల్లో తొలిరోజు 4713 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ), మధ్యాహ్నం 3వ సెమిస్టర్ వారికి పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పా రు. జిల్లా వ్యాప్తంగా రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నారని, అలాగే ప్రతి కేంద్రానికి అబ్జర్వర్‌ను నియమించామని తెలిపారు.

తిరుపతి టాస్క్‌ఫోర్స్ అదుపులో ప్రొద్దుటూరు వ్యక్తులు?

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం ప్రొద్దుటూరులోని దస్తగిరి పేటకు చెందిన ఆరుగురు వ్యక్తులను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తిరుపతికి తీసుకెళ్లి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరిలో ముగ్గురు మైనర్ పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల హైదరాబాదులో డ్రగ్స్ కేసులో ప్రొద్దుటూరు దస్తగిరిపేటకు చెందిన షేక్ మహ్మద్ హనీఫ్, చాంద్‌పీర్ అనే ఇద్దరు వ్యక్తులు అరెస్టు కాగా చెంచల్‌గూడా జైలులో వున్నారు. వీరిని కస్టడీకి తీసుకొని విచారించే క్రమంలో ప్రొద్దుటూరులో మరికొంతమంది డ్రగ్స్ రాకెట్‌లో వున్నట్లు సమాచారం రావడంతో స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం సాయంత్రం దస్తగిరిపేటలోని ఓ ప్రైవేటు స్కూలు సమీపంలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. కవ్వా అనే అడ్డ పేరుగల వ్యక్తి గురించి కొందరు కొత్త వ్యక్తులు ఆ ప్రాంతంలో ఆరా తీసినట్లు కూడా స్థానికులు నిర్ధారిస్తున్నారు. అయితే స్థానికంగా ప్రొద్దుటూరు పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకనే వారిని తీసుకెళ్లారా లేదా వారికి సమాచారం ఇచ్చి పట్టుకుపోయారా అనేది పోలీసులు ధ్రువీకరించడం లేదు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు పట్టివేత

సిద్దవటం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నా పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు దేగనవారిపల్లెకు చెందిన రైతు 100 డయల్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం ఉదయం దేగనవారిపల్లె గ్రామ సమీపాన 3 ఇసుక ట్రాక్టర్లను, బండికనుమపై 2 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు శివప్రసాద్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరం పంచాయతీలో అవకతవకలు, అవినీతిపై విచారణ

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో గతంలో చోటు చేసుకున్న అవకతవకలు, అప్పటి కార్యదర్శి గురుమోహన్ అవినీతిపై వచ్చిన ఆరోపణలపైన డీఎల్‌పీవో తిమ్మక్క గురువారం సమగ్ర విచారణ చేపట్టారు. 2019-23 మధ్య కాలంలో గోపవరం కార్యదర్శి గురుమోహన్ అవినీతికి పాల్పడ్డాడని, అప్పటి మాజీ వార్డు సభ్యుడు మార్తల సుబ్బారెడ్డి, డీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. జడ్పీసీఈవో ఆదేశాల మేరకు డీఎల్‌పీవో తిమ్మక్క సుమారు మూడు నెలల కిందట విచారించి నివేదిక అందించారు. అయితే ఆ నివేదిక సక్రమంగా లేదని, నిజాలు నిగ్గు తేలలేదని ఫిర్యాది డీపీవోను ఆశ్రయించారు. దీంతో ఫిర్యాదిదారుని పిలిపించి విచారణ చేపట్టి సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు డీఎల్‌పీవో గోపవరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదిదారుడు సుబ్బారెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. గోపవరం-కొత్తపల్లె పంచాయతీ పరిధిల్లో లేఅవుట్ అప్రూవల్‌లో అక్రమాలు జరిగాయని, చెన్నకేశవ అనే వ్యక్తి దొంగ సర్టిఫికెట్‌తో రూ.15 వేలు జీతంతో సుమారు రెండున్నర సంవత్సరంపాటు విధులు నిర్వహించి పంచాయతీ ఆదాయానికి గండికొట్టారని, గ్రామ పంచాయతీలో బినామీ పేర్లతో అక్రమ వసూళ్లు చేశారని, అప్పటి కార్యదర్శి గురుమోహన్ అవినీతి సంపాదనతో ఆస్తులు కూడబెట్టారని డీఎల్‌పీవోకు వివరించారు. వీటిపై లిఖితపూర్వక ఫిర్యాదు అందిస్తూ ఆధారాలు సమర్పించాలని ఆమె కోరగా ఇదివరకే పలుమార్లు ఫిర్యాదు చేశానని, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చాలని ఫిర్యాదిదారుడు పట్టుబట్టారు. దీంతో కొన్ని రికార్డులు అందుబాటులో లేవని, ఉన్నవాటిల్లో అధికారులు పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామాంజనేయులరెడ్డి, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టిన డీఎల్‌పీవో తిమ్మక్క

వంద రోజుల్లో సాగు, తాగునీరు అందిస్తాం : ఎమ్మెల్యే ఆది

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వామికొండ రిజర్వాయర్ పరిధిలో ఉన్న రైతులకు వంద రోజుల్లో సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. జీఎస్ఎస్ఎస్‌లో అంతర్భాగమైన వామికొండ రిజర్వాయర్ కింద అసంపూర్తిగా ఉన్న కాలువపనులు, భూసేకరణ తదితర అంశాలపై మాదన్నగారిపల్లె వద్ద గురువారం ఎమ్మెల్యే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయకట్టు పరిధిలోని ముద్దనూరు మండలానికి చెందిన ఉప్పలూరు, కొలవలి, ఒంటిగారిపల్లె, పెనికలపాడు, ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, కర్పుకుంటపల్లె, దండుపల్లె, వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దనపాడు, వీఎన్‌పల్లె మండలంలోని ఉరుటూరు, వెల్లుర్తి గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయర్‌లోని ఊటలు వస్తుండటంతో పంటలు పండటం లేదని ఒంటిగారిపల్లెకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ తీసేందుకు తీసుకున్న భూములకు ఒక్కోచోట ఒక్కవిధంగా నష్టపరిహారం ఇచ్చారని అందరికీ సమానంగా ఇవ్వాలని రైతులు కోరారు. మాదన్న గారిపల్లెకు చెందిన రైతులు మాట్లాడుతూ గతంలో రూ.6లక్షలు ఇచ్చారని ప్రస్తుతం రూ.22లక్షలు ధర పలుకుతోందని ఆప్రకారం ధర చెల్లిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మెయిన్ కాలువ ద్వారా నీరందడంలేదని లిఫ్ట్ ద్వారా అయితే తమ పొలాలకు, చెరువులకు అందుతాయని వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దన్నపాడు రైతులు తెలిపారు. కాగా, వామికొండసాగర్‌కు 1.65 టీఎంసీల సామర్థ్యం వుందని, కుడి కాలువ కింద ఉప్పలూరు తదితర గ్రామాల్లోని 2వేల ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దనపాడు, వీఎన్‌పల్లె మండలంలోని ఉరుటూరు, వెల్లుర్తి గ్రామాలకు మొత్తం 8వేల ఎకరాలకు నీరందించవచ్చని ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, ఏఈ సురేష్ రెడ్డిలు ఎమ్మెల్యేకి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే జూన్ 15నాటికి కాలువ పనులన్నీ పూర్తిచేసి రిజర్వాయర్ పరిధిలోని 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రైతులు సహకరించాలన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ వామికొండసాగర్ కింద ఉండే రైతులకు న్యాయం చేసేందుకు గతంలో కూడా పోరాడామని.. ఇప్పుడు మన ప్రభుత్వంవచ్చిందని అందరికీ న్యాయం చేస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

న్యాయమైన రేటును కల్పిస్తాం : జేసీ


రహదారి విస్తరణకు సంబంధించి పత్రాలను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి-రాయచోటి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు భూమి మార్కెట్ విలువతో పాటు న్యాయమైన రేటు కల్పించేలా అవార్డు ప్రకటిస్తామని జాయింట్ కలెక్టర్ అది తిసింగ్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో జాతీయ రహదారికి భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి అన్యాయం జరగకుండా రేటును కల్పిస్తామన్నారు. రైతులు, ప్లాట్లు యజమానులకు ప్రభుత్వ నిబంధనల మేరకే నష్టపరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు రైతులకు పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోండి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రుణాలు మంజూరు చేసి తీవ్ర నష్టాలతో ఇబ్బందులు పడుతున్న కౌలు రైతులను ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీలో కౌలు రైతుల సంఘం ఆదేశాల మేరకు గురువారం ఆయన రైతు సంఘం రాయచోటి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు హరినాధనాయుడు, బాలక్రిష్ణారెడ్డి, రమణ, లక్ష్మిరెడ్డిలతో కలిసి ఎస్‌బీఐ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులు గణనీయంగా ఉన్నారని. పంట సాగుదారు హక్కు చట్టం 2019 ప్రకారం వారిని గుర్తించాలని వినతిపత్రంలో కోరారు.

తంబళ్లపల్లెలో ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయండి

● మంత్రి లోకేశ్‌ను కోరిన జయచంద్రారెడ్డి



మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న జయ చంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. తిరుపతిలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్‌ను ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి కలిసి విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ములకలచెరువు, కురబలకోట మండలాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో బాలికలు, బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ములకలచెరువు, కురబలకోటలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ములకలచెరువులో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, కురబలకోటలో మైనార్టీ గురుకుల పాఠశాల, ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

అంగళ్లులో మళ్లీ భూ రగడపై అధికారుల విచారణ

కురబలకోట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనున్న భూ వివాదంపై అధికారులు విచారణ చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో అంగళ్లులో మళ్లీ భూ రగడ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై విచారణ చేపట్టి నివేదికను ఇవ్వాలని రెవెన్యూ అధికారులను జేసీ ఆదేశించారు. అలాగే ఈ భూ వివాదానికి సంబంధించి గతంలో పంచాయతీ అనుమతులు ఎవరైనా పొందార వాటికి సంబంధించి వివరాలను అందించాలని పంచాయతీ అధికారులను డీపీవో ఆదేశించారు.

రుణాల ఇంటర్వ్యూలకు 297 మంది హాజరు

కురబలకోట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 297 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి 53యూనిట్లు మంజూరు కాగా 414మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కాగా ఉదయం 10గంటలకు అంగళ్లు ఎస్‌బీఐ, కురబలకోట ఇండియన్ బ్యాంకు, మధ్యాహ్నం 2గంటలకు తెట్టు ఇండియన్ బ్యాంకు, ముదివేడు సప్తగిరి బ్యాంకు అధికారులు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించగా ఇందులో 377మందికి గానూ 297మంది హాజరయ్యారు. కాగా శుక్రవారం ఉదయం మట్లివారిపల్లె పంచాయతీకి సంబంధించిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మదనపల్లె టౌన్‌లో: మదనపల్లె మండలంలోని లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకై ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ఆధ్వర్యంలో 12 మంది బ్యాంకర్లు అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించారు. మదనపల్లె మండలంలో 84 యూనిట్లకు గాను 1286 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఈ ఇంటర్వ్యూలకు హాజరైన వారందరికి అర్హతను బట్టి, ఎంపిక చేసి వారికి 50శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

అవినీతిపై బహిరంగ చర్చకు రండి

● అక్రమ ఎన్నిక, అవినీతి పాలనతో పంచాయతీ పరువు గంగపాలు ● పీలేరు సర్పంచ్‌పై మండిపడ్డ టీడీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు

● అభివృద్ధిని అడ్డుకోవడానికి ఈవోను వేధిస్తున్నారంటూ వేర్వేరుగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయా పార్టీల నేతల ధ్వజం



పీలేరులో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా గడిచిన నాలుగేళ్ల పంచాయతీ పాలనలో జరిగిన నిధుల దుర్వినియోగంపై బహిరంగ చర్చకు రావాలని పీలేరులోని టీడీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు సవాల్ విసిరారు. అడ్డూఅదుపు లేని అవినీతి కారణంగా పీలేరు పరువును గంగపాలు చేశారన్నారు. అధికారుల విచారణలో సుమారు రూ.1.50 కోట్ల మేరకు నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారణ అయినప్పటికీ నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయకుండా ఈవోను వేధిస్తున్నారంటూ వారు మండిపడ్డారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి, పీలేరు నియోజకవర్గ ప్రచార కార్యదర్శి పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ అండతో అప్పటి ప్రతిపక్ష పార్టీల నామినేషన్లు చెల్లకుండా చేసి అక్రమ పద్ధతుల్లో స్థానిక సంస్థలను వైసీపీ నాయకులు అక్రమ పద్ధతుల్లో పదవులు పొంది తమ పరిపాలనలోనూ అంతులేని అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన వివిధ గ్రాంట్ల నిధుల వినియోగంపై విచారణ జరిపిస్తే రూ.1.50 కోట్ల మేర అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. అంతే కాకుండా పంచాయతీ పరిధిలోని నూతన గృహ నిర్మాణాల అనుమతుల మంజూరు విషయంలో విచారణ జరిపితే ఇంకో రూ.కోటి దాకా అవినీతి బయటపడుతుందన్నారు. అయితే సర్పంచ్ హబీబ్ బాషా సిగ్గూఎగ్గూ లేకుండా ఈవో గురుమోహన్‌పై అవినీతి ఆరోపణలు చేస్తున్నా రని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలో జరిగిన అవినీతి కారణంగా ఇప్పటికే ముగ్గురు అధికారులు ఉద్యోగాలు పోగొట్టుకున్నారన్నారు. వైసీపీ సర్పంచుల హయాంలో జరిగిన అవినీతిని నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, వారు బహిరంగ విచారణకు రావాలని సవాల్ విసిరారు.

సర్పంచ్‌పై ఆర్ఆర్ యాక్టు ప్రయోగించాలి

అధికారుల విచారణలో నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారణ అయిన నేపథ్యంలో సర్పంచ్ హబీబ్‌బాషాపై రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చివరకు దొంగే దొంగ అన్నట్లు సర్పంచ్ ఈవోపై ఆరోపణలు చేయడం సిగ్గు చేట న్నారు.

చెక్ పవర్ పోగొట్టుకున్న వాళ్లు ఆరోపణలు చేయడమా!

అధికారుల విచారణలో నిధులు దుర్వినియోగం కావడంతో చెక్ పవర్ కోల్పోయిన సర్పంచ్ హబీబ్ బాషా ప్రస్తుత ఈవో గురుమోహన్‌పై అవినీతి ఆరోపణలు చేయడం సిగ్గు చేటని బీజేపీ యువజనమోర్చా జిల్లా అధ్యక్షుడు నిమ్మనపల్లె పురుషోత్తం మండిపడ్డారు. పీలేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ అవినీతిపై లోతుగా విచారణ జరిపి ఆయన దిగమింగిన సొమ్మును రికవరీ చేయాలని, లేకపోతే ఆందోళనకు దిగుతామ ని హెచ్చరించారు.

ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటా.. : ఎమ్మెల్యే

వాల్మీకిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆదరించిన ప్రజలకు ఏ కష్టమొచ్చిన ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వాల్మీకిపురం మండలంలోని మంచూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మనోహర్ తల్లి మంగమ్మ(98) అనారోగ్యంతో బాధపడుతుండటం తెలుసుకుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కృష్ణప్ప నూతన గృహప్రవేశం కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీలోని ఎర్రావాండ్లపల్లె అడ్వకేట్ ఆనం దరెడ్డి సోదరుడు విజయభాస్కర్‌రెడ్డి ఉత్తర క్రియలలో పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్యలు వచ్చినా నేరుగా తనను కలిసి పరిష్కరించుకోవచ్చన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, నాయకులు ద్వారకనాథరెడ్డి, శేషాద్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, వలసపల్లెకు చెందిన అప్పయ్య భార్య రెడ్డెమ్మ(46) ఇంట్లో గొడవలతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

కలకడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):మద్యం తాగివాహనాలు నడిపిన కేసులో వాల్మీకిపురం కోర్టు గురువారం ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. కలికిరి, రాయచోటి మండలాలకు చెందిన పెద్దరెడ్డెప్ప, మహబూబ్‌బాషలకు ఒక్కొక్కరికి రూ.16 వేలతోపాటు వారం రోజుల జైలు శిక్షను విధించినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహనం దగ్ధం

గుర్రంకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):టమోటాల లోడ్‌తో మార్కెట్‌కు వెళుతున్న టాటా ఏసీ వాహనం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇందిరమ్మకాలనీ సమీపంలో గురువారం కాలిపోయింది. పెద్దమండ్యం మండలానికి చెందిన రైతు రమణ టమోటాలను వాహనంలో కలకడ మార్కెట్‌కు తరిస్తుండగా మార్గమధ్యంలో వాహనం ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలపడంతో మంటలు చెలరేగి ఇంజన్ పూర్తిగా కాలిపోయింది. అక్కడే ఉన్న స్థానికులు మంటలను నీళ్ల చల్లి ఆర్పివేశారు.

కులసంఘాలు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న నరేంద్ర

రామసముద్రం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కుల సంఘాలు బాధ్యతాయుతంగా పనిచేస్తేనే సమస్యల సాధన సులభమవుతుందని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయకుడు నరేంద్ర పేర్కొన్నారు. రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో నరేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ల గడుస్తున్నా కులవివక్షత పోలేదన్నారు. రామసముద్రం మండల కేంద్రంలో అంబేడ్కర్ స్థాపనకు రెండు ఎకరాల స్థలం కేటాయించాలని తహసీల్దార్ నిర్మలాదేవిని కోరారు. ప్రతి నెలా మానిటరింగ్ సమావేశంతో పాటు మండలంలోని ఒక గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని నరేంద్ర అధికారులను కోరారు. దళితులకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, ఎస్ఐ రవీంద్రనాథ్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి లీలావతి, దళిత సంఘాలు నేతలు కృష్ణప్ప, బాలాజి, జయరాజ్, భాస్కర్, నారాయణస్వామి, గుర్రప్ప, కొండప్ప, రామాంజులు, శేషు, నరసింహులు, శివశంకర్ పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పీఆర్ ఉద్యోగుల సంఘం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల వాయల్పాడు కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో కమిటీ పరిధిలోని కలికిరి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలకు చెందిన పంచాయతీ రాజ్ ఉద్యోగులు పాల్గొనగా యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా ఎస్. చక్రపాణి, ఉపాధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా సయ్యద్‌బాషా, సం యుక్త కార్యదర్శిగా విశ్వనాథ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లగా రుత్విక్‌రెడ్డి, ఖాద ర్‌వలి, తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఎన్నికల అధికారిగా ఈఈ జయచంద్ర వ్యవహరించారు.

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలం శిద్దంగారిపల్లెలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గురువారం రాత్రి పోతబోలుకు చెందిన కృష్ణప్ప, హసీనాబీ దంపతుల కుమారుడు గిరి (45) వివాహం చేసుకోకుండా తల్లి హసీనాబీతో కలిసి ఉపాధి కోసం బెంగళూరులో ఉండేవారు. అయితే ఏడాది క్రితం తన తండ్రి కృష్ణప్ప మృతి చెందడంతో అప్పటి నుంచి స్వగ్రామంలో ఉంటూ కూలీ పనులకు వెళ్లేవారు. వివాహ వయసు దాటినా వివాహం కాకపోవడంతో గిరి మద్యం మత్తుకు అలవాడు పడ్డాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. గమనించిన కుటుంబ సభ్యులు తాలుకా పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీ క్షల కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ కళా వెంకటరమ ణ పేర్కొన్నారు.

మాలల సింహ గర్జనను జయప్రదం చేయండి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 23న తిరుపతిలో నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. వాల్మీకిపురం పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. తిరుపతిలో జరగనున్న రాయలసీమ మాలల సింహ గర్జనకు ప్రతి ఇంటి నుంచి ఉద్యోగులు, మేధావులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, అంబేడ్కర్ వాదులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సుధాకర్, రఘు, శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు నాగార్జున పాల్గొన్నారు.

క్షయవ్యాధి లేని సమాజాన్ని నిర్మిద్దాం

నిమ్మనపల్లి ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి లేని సమాజం కొరకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతిలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, గలరావడం, ఛాతీలో నొప్పితో పాటు జ్వరం వస్తూ ఉంటే దానిని క్షయ లక్షణంగా గుర్తించి వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలపాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయితే 6నెలల పాటు పూర్తి ఉచితంగా చికిత్సలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చెన్నమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 22న ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీవో నాగరాజు తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు వారు అర్హులన్నారు.

సిద్ధేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కలకడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):కలకడ సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో గురువారం వేడుకగా అంకురార్పణ నిర్వహించారు. కామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21న ధ్వజరోహణం, శేషవాహనం, 22న రావణ వాహనం, 23న హంస వాహనం, 24 మయూర వాహనం, 25న కల్యాణోత్సవం, గజ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అలాగే 26న మహాశివరాత్రి పర్వదినం రోజున శిఖర దర్శనం, రుద్రాభిషేకం, వృషభవాహనం, లక్షబిల్వార్చన కార్యక్రమాలు, 27న ఝరి ఉత్సవం, యాలివాహనం, 28న త్రినేత్రదారణ, మహానివేదనం, రథోత్సవం, తోటోత్సవం, మార్చి 1న వసంతోత్సవం, త్రిశూల స్నానం, సింహవాహనం, 2న పార్వేట, అశ్వ వాహనం, 3న ధ్వజారోహణం, తెప్పోత్సవం, ఊంజల్ సేవలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు కొనేని రెడ్డెప్పనాయుడు పాల్గొన్నారు.

ఆటపాటల ద్వారా విద్యపై ఆసక్తి కలిగించాలి

పీలేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక పాఠశాలలైన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగించాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి పేర్కొన్నారు. కేవీపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న 'జ్ఞానజ్యోతి' శిక్షణ తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'జ్ఞాన జ్యోతి' శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ కేంద్రాల్లో విధిగా అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి షమీవుల్లా ఖాన్, ఎంఈవోలు రెడ్డిబాషా, లోకేశ్వర రెడ్డి, సీడీపీవో రాజమ్మ, హెచ్ఎం నటరాజన్, కోర్సు రీసోర్స్ పర్సన్‌లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల నుంచి ప్రాణహాని ఉంది

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):ఆలయ కమిటీ సభ్యుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆలయ అర్చకుడు లోకనాథ్ దీక్షిత్ తెలిపారు. గురువారం మదనపల్లెలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకేశ్వరస్వామి ఆలయానికి వంశపార్యపరంగా తమ కుటుంబసభ్యులే ప్రధాన అర్చకులుగా ఉన్నామన్నారు. త్వరలో మహాశివరాత్రి ఉండడంతో ఏర్పాటు చేస్తుండగా ఆలయకమిటీ సభ్యులైన నందకుమార్, మల్లికార్జునలు తనపై దాడికి పాల్పడారని తెలిపారు. ఈ విషయమై ఈనెల 14న సీఎం నారాచంద్రబాబు నాయుడును కలిసి స్వయంగా విన్నవించగా న్యాయం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రామసముద్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానేవారిపల్లె పంచాయతీ నాగన్నపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ దాడులోమల వారివద్ద నుంచి రూ.4010 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇల్లు ఒకరిది..బిల్లులు మరొకరికి..?!

● ఉపాధి పనుల్లో అవినీతిపై అధికారుల విచారణ ● ఉద్యోగుల పేరిట బిల్లులు



టి.పసలవాండ్లపల్లెలో ఉపాధి పనులపై కూలీలను విచారిస్తున్న ఎంపీడీవో

గుర్రంకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధిహామి పథకంలో ఇల్లు ఒకరి పేరుతో ఉండగా బిల్లులు మరొకరి చెల్లించిన ఘటన అధికారుల విచారణలో వెల్లడైంది. గుర్రంకొండ మండలం టి.పసలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనుల్లో వేలాది రూపాయల అవినీతి జరిగినట్లు కూలీలు, గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ఎంపీడీవో వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డిలు సిబ్బందితో కలిసి గురువారం టి.పసలవాండ్లపల్లెలో ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఇందులో గ్రామానికి చెందిన కె.భార్గవి పేరిట ఇల్లు మంజూరు కాగా పునాది బిల్లులకు మస్టర్ నెంబరు 4808, వర్క్ ఐడీ నెంబరు 0210007001/1ఎఫ్/19187011430898 నమోదు చేశారు. అయితే ఈమె ఇంటి బిల్లును ఇతరులైన ఆనంద్ వర్క్ ఐడీ ఏపీ10007001001/9000488 పేరిట ఏడు రోజులు పని చేసినట్లు చూపి రూ.2100ను, టి.రెడ్డెప్ప పేరిట రూ.2100, ధనరాణి పేరిట రూ.2100, గంగార్జున పేరిట రూ.2100, మమత పేరిట రూ.2100, ప్రసాద్ పేరిట రూ.2100లు మొత్తం రూ.12,600 స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. అలాగే గ్రామానికి చెందిన మిలటరీ ఉద్యోగుల పేరిట బినామీ మస్టర్లు వేసినట్లు అవినీతికి పాల్పడినట్లు ఎంపీడీవో వెంకటేశులు తెలిపారు. అంతేకాకుండా బయట ప్రాంతాల్లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ల పేరిట కూడా ఉపాధి బిల్లులు చేసినట్లు అధికారులు తేల్చారు. గ్రామంలో ఉపాధి పనులను పూర్తి స్థాయిలో విచారించి అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకొంటామని ఎంపీడీవో తెలిపారు. అలాగే అవినీతికి సహకరించిన మిగిలిన సిబ్బందిపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఏపీవో జయరామిరెడ్డి తెలిపారు. గ్రామంలో ఉపాధి పనులను మరొ రెండు రోజులు క్షుణ్ణంగా తనిఖీ చేసి అవినీతి, అక్రమాలను గుర్తిస్తామని ఏపీవో తెలిపారు.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు : డీఎల్‌డీవో

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోనున్నట్లు డీఎల్‌పీవో నాగరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక డీఎల్‌పీవో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్‌లో పలు చోట్ల పీకేఎం ఉడా అనుమతి లేకుండా లేఅవుట్లు వేశారన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే అక్రమదారులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. డివిజన్‌లోని పలు మేజర్ పంచాయతీల్లో అనుమతికి మించి బహుళ అంతస్థుల భవనాలు నిర్మించారని వాటిపై నివేదికలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినా కొందరు మాత్రమే స్పందించారని, మిగిలిన వారిపై క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు ముఖ్య ఆదాయ వనరులైన ఇంటిపన్నులను మార్చి నెలలోపు వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించామన్నారు.

మదనపల్లె డీఎల్‌పీవోపై చర్యలు తీసుకోండి



డీఎల్‌పీవోపై సబ్‌కలెక్టరేట్ డీఏవోకు ఫిర్యాదుచేస్తున్న బహుజన సేన నేతలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):పంచాయతీ కార్యదర్శులను వేధిస్తున్న మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజుపై చర్యలు తీసుకోవాలంటూ బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు అధికారులను కోరారు. ఆమేరకు గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో రాఘవేంద్రకు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుమార్లు పంచాయతీ కార్యదర్శులను వేధించడమే కాకుండా డీఎల్‌పీవో సర్పంచ్‌లను బెదిరిస్తున్నారని బహుజనసేకు పలువురు ఫిర్యాదులు చేశారన్నారు. పంచాయతీఫైళ్లను తన వెంట తీసుకెళ్లి మాయంచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆరోపణలపై విచారించి తగుచర్యలు తీసుకోవాలని శ్రీచందు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అగ్నిమాపక కేంద్రాన్ని తరలిస్తే ఉద్యమిస్తాం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ములకలచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు అగ్నిమాపక కేంద్రాన్ని తరలించాలని చూస్తే ఉద్యమిస్తామని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప హెచ్చరించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఎదుట గురువారం సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలచెరువులో 21 ఏళ్లుగా కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రానికి పక్కాభవనం నిర్మాణానికి నిధులు మంజూరు కాగా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం చూపి 20 కిలోమీటర్ల దూరంలో స్థలం కేటాయించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణం చొరవ తీసుకుని భవన నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ రద్దు చేసి అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణానికి ములకలచెరువు చుట్టుపక్కల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘం నాయకులు మల్లికార్జున, రమేష్, ఏఐటీయూసీ నాయకుడు సలీంబాషా, ఆటో యూనియన్ నాయకులు ఉత్తన్న, నరసింహులు, శివప్ప, సదాశివప్ప తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులపై జగన్‌ది కపటప్రేమ

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డులోకి వెళ్లిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కడ రైతులపై కపటప్రేమ చూపించారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ విమర్శించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 11 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి వెళ్లి రైతుల సమస్యలను చర్చించాల్సిన జగన్, తాడేపల్లె ప్యాలెస్‌కే పరిమితమయ్యారన్నారు. అక్రమాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పరామర్శించేందుకు జైలుకు వెళ్లివచ్చిన జగన్, మిర్చి రైతులను పరామర్శించే డ్రామా లేవనెత్తాడన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి డ్రామాలు ఆడుతున్న జగన్, తనకు పోలీసు బందోబస్తు ఇవ్వలేదని వైసీపీ నాయకులతో గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామనడం సిగ్గుచేటన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

● సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ ప్రభహరన్



సప్తగిరి గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జీఎం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) :ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ ప్రభ హరన్ పేర్కొన్నారు. పీటీఎం మండలంలోని కందుకూరులో గత 40 సంవత్సరాలుగా విజయవంతంగా నడుస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖను నూతన భవనంలో పునః ప్రారంభించారు. అనంతరం బ్యాంక్ ఖాతా దారులతో జరిగిన బహిరంగ సమావేశంలో జీఎం మాట్లాడు తూ చిరువ్యాపారులు, కుటీర పరిశ్రమలకు తగిన రుణాలు ఇస్తున్నామన్నారు. బంగారు ఆభరణాలపై మిగతా బ్యాంకులతో పోలిస్తే సులభతరంగా రుణాలు ఇస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం బ్యాంక్ సర్వీసు ఏరియాలోని అన్ని గ్రామాలలో బ్యాంకు సేవా మిత్రాల ద్వారా లావాదేవీలను చేరువ చేశామన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ప్రకాశ్ రత్నబాబు, కందుకూరు బ్రాంచి మేనేజర్, రంగా, సిబ్బంది శిరిషా, చందు, గీత, ఉమామహేశ్వర, లక్ష్మి పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంపొందించేందుకే వాటర్‌షెడ్లు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) భూగర్భ జలాలు పెంపొందించడమే వాటర్‌షెడ్ల నిర్మాణాల లక్ష్యమని పీవో రవీంద్రుడు పేర్కొన్నారు. పెద్దమండ్యం మం డలం కోటకాడపల్లి ప్రాంతంలో గురువారం వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమాలు కొనసాగాయి. గ్రామంలో వాటర్ షెడ్ ప్రయోజనాలు వివరిస్తూ చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మండలంలో రెండు వాటర్‌షెడ్లు, 7 మైక్రో వాటర్‌షెడ్ల పరిధిలో 220 పనులకు గాను రూ. 2.5 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వాటర్‌షెడ్ యాత్ర వల్ల వాటర్‌షెడ్ల పనులను ప్రజలకు వివరిస్తామన్నారు. రైతు శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం ఈ వాటర్‌షెడ్ యాత్ర ప్రవేశ పెట్టిందన్నారు. అనంతరం వాటర్‌షెడ్ నిర్మాణానికి భూమి పూజా నిర్వహించారు. వాటర్‌షెడ్ల వల్ల ప్రయోజనాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి, వాటర్‌షెడ్ జేఈ మోహన్, టీవో శ్రీనివాసులు, సర్పంచులు భేదేవి, సుధాకర, కూటమి నేతలు ప్రభాకర రెడ్డి, రామకృష్ణారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ వెంకటరమణరెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.